ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
బుధవారం 2 ఏప్రిల్ 2025

ఉపాధి బకాయి రూ.వంద కోట్లు..!


కోడుమూరు మండలం ముడుములగుర్తి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా మట్టి పనులు చేస్తున్న కూలీలు

- కూలీల వేతనాలు రూ.50 కోట్లు..
- సీసీ రోడ్లకు రూ.50 కోట్లు
- పస్తులతో పనులు చేసేదెలా..?
- జిల్లాలో ఉపాధి హామీ కూలీల ఆకలి కేకలు

స్వగ్రామంలోనే పనులు కల్పించి గ్రామీణ పేదల ఆకలి తీర్చాలనే లక్ష్యంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్నారు. అమలులో లోపాలు కూలీలకు శాపంగా మారుతోంది. జనవరి 8న తేదీ నుంచి కూలి సొమ్ము రాకపోవడంతో ఉపాధి కూలీలు ఆవేదన వర్ణనాతీతంగా మారింది. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే ఖాతాలో జమ చేస్తామని అధికారులు చెబుతున్నా కూలీల్లో మాత్రం రోజురోజుకూ ఆశలు సన్నగిల్లుతున్నాయి. రాష్ట్రంలో 1.55 లక్షల ఫారంపాండ్స్ (పంట కుంటలు) తవ్వకాలకు భూమి పూజ కోసం గత నెల 22న ఓర్వకల్లు మండలం పుడిచర్ల గ్రామానికి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వచ్చారు. ఆ సమయంలోనూ కూలీలు ఏకరువు పెట్టారు. త్వరలోనే కూలీ సొమ్ము వచ్చేలా ప్రభుత్వంతో మాట్లాడుతానని పవన్ హామీ ఇచ్చారు. ఉపాధి కూలీల వేతనాలు, మెటీరియల్ కాంపోనెంట్ నిధులు కలిపి దాదాపు రూ.100 కోట్లు బకాయి ఉంది. వెంటనే వేతనాలు చెల్లించాలని కూలీలు కోరుతున్నారు.

కర్నూలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 484 గ్రామ పంచాయతీలు, 237 మజరా గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) అమలు అవుతోం ది. ఇప్పటివరకు 3.32 లక్షల జాబ్ కార్డులు మంజూరు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 70 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యం. ఇప్పటి వరకు రూ.350 కోట్లు ఖర్చు చేశారు. కూలీల వేతనాలు (లేబర్ బడ్జెట్) రూ.250 కోట్లు ఖర్చు చేయగా.. మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.100 కోట్లు వరకు ఖర్చు చేశారని డ్వామా అధికారులు పేర్కొన్నారు. అయితే జనవరి 8వ తేదీ తర్వాత 12 వారాలుగా కూలీలకు వేతనాలు చెల్లించాల్సి ఉంటే.. ఉగాది ముందు నాలుగు వారాలు వేతనాలు జమ చేశారు. ఇంకా 8 వారాలకు సంబంధించిన కూలి సొమ్ము జమ చేయాల్సి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగిసినా బకాయి డబ్బులు రాకపోవడంతో కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రతి రోజు లక్ష మందికి ఉపాధి కూలీలని లక్ష్యంగా కాగా.. ప్రస్తుతం సగటున 60-65 వేల మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారని డ్వామా అధికారులు పేర్కొంటున్నారు. మంగళవారం మస్టర్లను పరిశీలిస్తే 33,561 మంది మాత్రమే పనులకు హాజరయ్యారు. ప్రతి క్లస్టర్ పరిధిలో కనిష్ఠంగా 4,808, గరిష్ఠంగా 8,181 మంది కూలీలు పనులకు హాజరయ్యారు. కూలీలకు రోజువారి వేతనాల రూపంలో రూ.50 కోట్లు, పల్లె పండుగ పేరిట మెటీరియల్ కాంపోనెంట్ నిధులు సుమారు రూ.85 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లు వేశారు. ఆ పనులకు సంబంధించి మరో రూ.50 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. గోకులం షెడ్లు నిర్మించుకున్న రైతులకు కూడా ఒక్క రూపాయి కూడా బిల్లులు రాలేదని అంటున్నారు. ఉపాధి హామీ కూలీల అవస్థలను ప్రజాప్రతినిధులు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బకాయిలు మంజూరు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బకాయి వాస్తవమే

జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు సుమారుగా రూ.50 కోట్లు వేతన బకాయి ఉన్నమాట నిజమే. మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, గోకులం షెడ్లకు మరో రూ.50 కోట్లు బకాయి చెల్లించాల్సి ఉంది. రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. త్వరితగతిన బకాయిలు చెల్లించేందుకు కృషి చేస్తున్నాం.
- వెంకట రమణయ్య, డ్వామా పీడీ, కర్నూలు

క్లస్టర్ల వారీగా మంగళవారం హాజరైన కూలీలు

క్లస్టర్	లక్ష్యం	హాజరు	శాతం
ఆదోని	23,800	7,753	32.58
ఆలూరు	26,500	8,181	49.58
కర్నూలు	20,400	5,626	27.58
పత్తికొండ	22,500	4,808	21.37
ఎమ్మిగనూరు	15,800	7,193	45.53
మొత్తం	1,00,000	33,561	33.56


హొళగుంద మండలం కోగిలతోట గ్రామంలో ఉపాధి పనుల్లో కూలీలు

ఉపాధి నిధులతో సీసీ రోడ్లు

రాష్ట్రంలో కర్నూలుకు మొదటి స్థానం

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లను లక్ష్యం మేరకు వేగవంతం చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా నీటి యాజమాన్య సంస్థ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయ నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే కర్నూలు జిల్లాకు మొదటి స్థానం దక్కడంతో ఆ శాఖ అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది 8,500 ఫారం పాండ్స్, 300 పశువుల నీటి తొట్ల నిర్మాణానికి వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత సంవత్సరం ఉపాధి హామీ పథకం ద్వారా సాధించిన ప్రగతిని కలెక్టర్ వివరించారు. 2.14 లక్షల కుటుంబాలకు 89 లక్షల పనిదినాలు కల్పించి రూ.250 కోట్ల వేతనాలు అందించినట్లు తెలిపారు.


రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

నకిలీ పత్రాలతో మహా మోసం 7లో

చౌక దుకాణాల్లో తనిఖీలు

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మంగళవారం సివిల్ సప్లయ్ అధికారులు విజిలెన్స్ అధికారులతో రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాలను, రేషన్ షాపులను తనిఖీ చేశారు. అందులో భాగంగా అధికారులు ఎండీయూ 62ను తనిఖీ చేయగా.. భౌతిక రేషన్ నిలువల్లో 245 కేజీలు బియ్యం, 82 ప్యాకెట్ల చక్కెర తక్కువగా నమోదైంది. అతనిపై సెక్షన్ 6ఏ కింద అధికారులు కేసు నమోదు చేశారు. అదే విధంగా తనిఖీ నిమిత్తం కొత్తపేటకు చెందిన రేషన్ దుకాణం 53కు అధికారులు వెళ్లగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రేషన్ డీలర్ దుకాణానికి తాళం వేసి వెళ్లిపోయాడు. ఈ మేరకు అధికారులు రేషన్ దుకాణం 53కు నోటీసుతో సీల్ వేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో రాజారఘువీర్, ఏఎస్‌వో రామాంజనేయరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.


రేషన్ దుకాణానికి సీలు వేసిన సివిల్ సప్లయ్ అధికారులు

హమ్మయ్యా..!

- ముగిసిన పదో తరగతి పరీక్షలు
- 430 మంది విద్యార్థులు గైర్హాజర్
- ప్రశాంత వాతావరణంలో పరీక్షలు : కలెక్టర్ రంజిత్ బాషా
- రేపటి నుంచి పది పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం



కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మార్చి 17వ తేదీన ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిసాయి. మొదటిసారి బోర్డు పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఎంతో ఆందోళనలకు గురయ్యారు. దీనికి తోడు ఈసారి ఏడు పేపర్లును మాత్రమే నిర్వహించారు. వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉండడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. పరీక్షల టెన్షన్‌కు తోడు వేసవి ఎండల తీవ్రత తోడైంది. ఒకటి రెండు సంఘటనలు మినహా ప్రశాంతంగా పరీక్షలు జరగడంతో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఎప్పుడూ లేనంతగా ఈసారి పదో తరగతి పరీక్షకు గైర్హాజరయ్యే విద్యార్థుల సంఖ్య పెరిగినట్లు విద్యాశాఖ అధికారుల గణాంకాలను బట్టి తెలుస్తుంది. సోషల్ స్టడీస్ పరీక్షకు మొత్తం విద్యార్థులు 32,420 మంది నమోదు చేసుకున్నారు. 31,990 పరీక్షకు హాజరు కాగా, 430 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదు.



కర్నూలు జిల్లాలో 517 ఉన్నత పాఠశాలల నుంచి రెగ్యులర్, ప్రైవేటు ఓపెన్ స్కూల్ విద్యార్థులు మొత్తం 40,776 మంది విద్యార్థులు పరీక్షలకు నమోదు చేసుకున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 31,410 మంది కాగా, ప్రైవేటుగా పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 7038 మంది ఉన్నారు. ఈ విద్యార్థుల కోసం 172 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఓపెన్ స్కూల్ ద్వారా 2328 మంది నమోదు చేసుకున్నారు. పది పరీక్షల నిర్వహణకు దాదాపు 2,300 మందికి విధులను కేటాయించారు. జిల్లా పరీక్షల పర్యవేక్షణాధికారిగా అమరావతి స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ అబ్రహాం, కడప ఆర్జేడీ శామేల్, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ ఆధ్వర్యంలో పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. చివరి రోజు మంగళవారం పరీక్ష రాశాక విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుంచి కేరింతలు కొడుతూ బయటకు వచ్చారు. కొత్త విద్యాసంవత్సరంలో కళాశాలలో కలుసుకుందామంటూ వీడ్కోలు చెప్పుకున్నారు. పరీక్షలు పూర్తి కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు తమ సరంజామాను సర్దుకుని సొంత గ్రామాలకు బయలుదేరేందుకు నగరంలోని ఆర్టీసీ బస్టాండు, రాజ్‌విహార్, సీ.క్యాంపు, బిర్లాగేటు బస్టాపుల్లో రద్దీగా కనిపించింది.


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

రేపటి నుంచి పది పరీక్షల స్పాట్ వాల్యుయేషన్: ఈ నెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు బి. తాండ్రపాడులోని క్రేడో ఇంగ్లీష మీడియం పాఠశాలలో పదో తరగతి పరీక్ష ప్రశ్నాపత్రాల మూల్యాంకన శిబిరం ప్రారంభం కానున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో పది పరీక్షలు

జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. మంగళవారం స్థానిక కంట్రోల్ రూమ్ సమీపంలో ఉన్న దామోదరం సంజీవయ్య స్మారక మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.
- కలెక్టర్ రంజిత్ బాషా

నేటి నుంచి జేఈఈ-మెయిన్స్-2 ప్రవేశ పరీక్ష

- 2 నుంచి 8వ తేదీ వరకు పేపర్-1 ఇంజనీరింగ్ పరీక్షలు
- 9న పేపర్-2 బీఆర్క్, పేపర్-2బీ ప్లానింగ్ పరీక్ష
- అరగంట ముందే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీ ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్-2025 రెండో సెషన్స్ పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి 9వ తేదీ వరకు జరగనున్నాయి. ఏప్రిల్ 2 నుంచి 8వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పేపర్-1 (బీటెక్) పరీక్షలు జరుగుతాయి. 9వ తేదీన ఉదయం పేపర్-2ఏ బీఆర్క్ పరీక్ష, పేపర్-2బి ప్లానింగ్ పరీక్షలు జరుగుతాయి. జేఈఈ-మెయిన్స్ మొదటి సెషన్స్ మాదిరిగానే కంప్యూటర్ బేస్డ్ టెస్టు విధానంలో ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతాయి. కర్నూలు నగరం స్థానిక చెక్‌పోస్టు సమీపంలోని సనత్‌నగర్‌లోని అయాన్ డిజిటల్ సెంటర్‌ను పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేశారు.



పాటించాల్సిన సూచనలు

- పేపర్-1 ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష మొదటి సెషన్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుంది. రెండో సెషన్ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ఉదయం షిఫ్టులో జరిగే పరీక్షకు 7 గంటలకు, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 1 గంటకు పరీక్ష కేంద్రాలకుచేరుకోవాల్సి ఉంటుంది.
- విద్యార్థులు సాధారణ వస్త్రాలను మాత్రమే ధరించాలి. ట్రాన్స్పరెంట్ వాటర్‌బాటిల్‌ను మాత్రమే అనుమతిస్తా రు. దరఖాస్తు సమయంలో అప్‌లోడు చేసిన ఆధార్, పాన్ ఒరిజినల్ ఐ డెంటిటీ కార్డులను విధిగా తీసుకెళ్లాలి.
- విద్యార్థి తమ వెంట అడ్మిట్ కార్డుతో పాటు అటెండెన్స్ షీట్‌పై అతికించేందుకు పాస్ ఫొటోను వెంట తీసుకెళ్లాలి.
- పరీక్ష సమయానికి అరగంట ముందు వరకే కేంద్రంలోకి అనుమతిస్తారు. ఆ తర్వాత ప్రధాన గేట్లను మూసివేస్తారు.
- ఆభరణాలు, వాచ్‌లు, కాళ్ల బూట్లకు బదులుగా సాధారణ చెప్పులను మాత్రమే ధరించాలి.

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో స్లాట్ బుకింగ్ సేవలు అందించాలి

డీఐజీ పీజీఎస్ కళ్యాణి

కల్లూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రజలకు స్లాట్ బుకింగ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ.పీజీఎస్. కళ్యాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్లు, ప్రజలు సిబ్బందికి అవగాహన కల్పించారు. నేటి నుంచి జిల్లా కేంద్రంలోని కర్నూలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో స్లాట్ బుకింగ్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని, ఆ దిశగా ప్రజలకు సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం ఆఫీసులకు వచ్చే ప్రజలకు తమ విలువైన సమయం ఆదా అయ్యేలా కోరుకున్న రోజుకు, నిర్దిష్ట సమయానికి స్లాట్ బుకింగ్ చేసుకునే వెసలుబాటు కల్పించారని వివరించారు. కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్లు వరప్రసాద్, ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా రెండో గ్యాస్ సిలిండర్

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం దీపం-2 పథకం కింద సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అర్హత కలిగిన గ్యాస్ వినియోగదారులకు అందజేస్తోంది. అందులో భాగంగా డిసెంబరు- మార్చి మొదటి ఉచిత గ్యాస్ సిలిండర్ డెలివరీ ప్రక్రియ పూర్తయింది. మంగళవారం నుంచి దీపం-2 పథకం కింద రెండో ఉచిత గ్యాస్ సిలిండర్ ప్రక్రియ మొదలైంది. జిల్లాలో అర్హత కలిగిన గ్యాస్ వినియోగదారులు రెండో ఉచిత గ్యాస్ సిలిండర్‌ను నమోదు చేసుకోవచ్చని జిల్లా సివిల్ సప్లైస్ అధికారులు తెలిపారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బీ.తాండ్రపాడు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం ఉచిత కోచింగ్ ఇచ్చి స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎంవీఎస్ఎస్ఎన్ ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ నెల 2వ తేదీ నుంచి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9492403015 ను సంప్రదించాలని తెలిపారు.

ఉగాది ఆదాయం రూ.47.31 లక్షలు

మహానందీశ్వరుడికి గత ఏడాది కంటే రూ.5.06 లక్షలు అధికం

మహానంది, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మహానంది క్షేత్ర దర్శనానికి వచ్చిన కన్నడ భక్తుల రద్దీ వల్ల దేవస్థానానికి రూ.47,31,792 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు.ఇందులో సేవా టికెట్ల విక్రయంతో పాటు లడ్డు ప్రసాదాలు, తాత్కాలికంగా ఏర్పాటు చేసుకొన్న దుకాణాల ద్వారా ఈ ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది ఉగాది కన్నడ భక్తుల రద్దీ వల్ల రూ.42,24,818 ఆదాయం రాగా ఈ ఏడాది 5,06,974 ఆదాయం అధికంగా వచ్చిందని ఈవో పేర్కొన్నారు.

ఆర్టీసీకి పెరిగిన ఉగాది ఆదాయం: డీఎం

నంద్యాల మున్సిపాలిటీ ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా నంద్యాల ఆర్టీసీ డిపో ఆదాయం పెరిగిందని నంద్యాల డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. గత సంవత్సరం ఉగాది సందర్భంగా నంద్యాల ఆర్టీసీకి రూ. 10,41,683 ఆదాయం రాగా ఈ సంవత్సరం రూ. 10,79,588 వచ్చినట్లు డీఎం తెలిపారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.6.10 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

శ్రీశైలం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఆలయంలోని చంద్రావతి కల్యాణమండపంలో గడిచిన 27 రోజులకు సంబంధించి జరిగిన హుండీ లెక్కింపులో రూ.6.10 కోట్లు ఆదాయం సమకూరింది. దీంతో పాటు 20.1 తులాల బంగారు, 6.2 కిలోల వెండి లభించింది. అదేవిధంగా 990 యుఎస్ఏ డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, 16 మలేషియా రింగిట్స్, 30 ఆస్ట్రేలియా డాలర్లు, 20 యూకే పౌండ్స్, 810 యుఏఈ దిర్హామ్స్, 250 మెక్సికో పిసో, 130 కెనడా డాలర్ల విదేశీ కరెన్సీ వచ్చింది. పటిష్టమైన భద్రత మధ్య ఈ లెక్కింపు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు, డీఈఓ రమణమ్మ, అధికారులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

విద్యా విధానంలో విపరీత ధోరణి

- పది పరీక్షలు ముగియక ముందే ఇంటర్ తరగతులు
- మొదటిరోజు 10శాతం కూడా హాజరుకాని విద్యార్థులు
- విద్యా విధానం పట్ల అవగాహన లేమి కారణమంటున్న నిపుణులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 01 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాశాక, ఇంటర్ తరగతులు మొదలు కావడం హేతుబద్ధం. అట్లాంటిది ఈసారి పది పరీక్షలు పూర్తి కాకముందే ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్నారు. వేసవి సెలవులకు ముందే 23 రోజుల పాటు ఇంటర్ తరగతులు నిర్వహించి, మొదటి సంవత్సరం అడ్మిషన్లు పెంచాలనే ప్రభుత్వం అనుకుంటోంది. కార్పొరేట్ విద్యావిధానం వల్ల ఇంటర్మీడియట్ విద్య ప్రభుత్వ రంగంలో దాదాపుగా దెబ్బతినిపోయింది. దీంతో ఇంటర్‌లో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరేవారే కరువయ్యారు. ఈ సమస్యకు పరిష్కారం కోసం వేసవిలోనే తరగతులు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఒకవైపు ఏప్రిల్ 5వ తేదీ దాకా ఇంటర్ ప్రశ్నాపత్రాల మూల్యాంకనంలో అధ్యాపకులు తీరిక లేకుండా ఉన్నారు. 10వ తరగతి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 3న మొదలై 9వ తేదీ దాకా జరుగుతాయి. ఆ తర్వాత ఫలితాలు వస్తాయి. ప్రభుత్వం హడావుడిగా ఏప్రిల్ 1నుంచే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తరగతులకు హాజరుకావాలని ఆదేశించడం విడ్డూరమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ విధానంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో గందరగోళం నెలకొన్నది.



మొదటిరోజు తరగతికి హాజరైన ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు

ప్రభుత్వం ఏ విధానం అమలు చేసినా ఆచరణలో ప్రజలకు సౌకర్యంగా ఉండాలి. కానీ ఇంటర్ తరగతుల్లో ప్రభుత్వం గందరగోళంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పదో తరగతి హాల్ టిక్కెట్ ఆధారంగా ఈనెల 7వతేదీ నుంచి ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశం పొందేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించినప్పటికీ ఆ దిశగా ముందుగానే విద్యార్థుల్లో, వారి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించడంలో విద్యాశాఖ కాస్త నిర్లక్ష్యం వహించిందనే చెప్పవచ్చు. మంగళవారం అనేక ప్రైవేట్ కళాశాలల్లో ఒక్క విద్యార్థి కూడా హాజరు కాలేదు. దీనిపై కళాశాలల యాజమాన్యాన్ని ఆంధ్రజ్యోతి పలుకరించగా.. పరీక్షలు ఇటీవలే ముగియడం వల్ల విద్యార్థులు మళ్లీ వెంటనే కళాశాలకు రావడానికి ఇష్టపడడం లేదని అన్నారు. అధ్యాపకులు కూడా జవాబు పత్రాల మూల్యాంకనంలో బిజీగా ఉన్నారని చెప్పారు. నంద్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాత్రం 273 మంది విద్యార్థులకు గాను కేవలం 22 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు పరీక్షలు అయిపోగానే వారి సొంత ఊర్లకు వెళ్లిపోయారు. మధ్యలో వస్తే హాస్టళ్లలో వారికి భోజనం, సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం అనుకోలేదు. దీంతో ఇంటర్ తరగతులపై అధికారులు, నిపుణుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మధ్యాహ్నం వరకే నిర్వహించాలి



ఇంటర్ ద్వితీయ సంవత్సరం 23 రోజుల తరగతులను మధ్యాహ్నం వరకు మాత్రమే నిర్వహిస్తే బాగుంటుంది. వేసవి వడగాల్పుల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండే వీలుంటుంది. నూతన విద్యావిధానం వల్ల విద్యార్థులకు మంచి జరుగుతున్నా లోటుపాట్లను సవరించుకుని ముందుకెళితే బాగుంటుంది. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలపై విద్యార్థుల్లో ఆసక్తి ఉంది. మంచి నిపుణులైన అధ్యాపకులు ఉన్నారు.

- శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి

ప్రభుత్వ విధానం భేష్



ప్రభుత్వ విద్యావిధానం బాగుంది. 23 రోజుల తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలున్నాయి. ఇప్పటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్ రికార్డ్ బుక్స్ సిద్ధంగా ఉన్నాయి. నిర్దేశిత మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం కూడా 23 రోజులు అమలు చేస్తున్నాం. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు వీలుగా ఈనెల 7వ తేదీ నుంచి బ్రిడ్జి క్లాసులు కూడా ప్రారంభిస్తున్నాం. ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు వేసవి సెలవులుంటాయి. విద్యార్థులు తప్పనిసరిగా తరగతులకు హాజరుకావాలి.

- చక్రధర్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

విద్యార్థుల తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాలి



ఒక్కసారిగా హడావుడిగా కాకుండా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించి తరగతులను ప్రారంభించి ఉంటే బాగుండేది. ఒకవైపు ఇంటర్ మూల్యాంకనం జరుగుతుండగా, మరోవైపు 10వ తరగతి మూల్యాంకనం ప్రారంభిస్తున్న తరుణంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సాహసోపేతమే. ఈ విధానంతో నష్టం లేదు.

- శివయ్య, ఐక్య ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షుడు, నంద్యాల

సంస్కరణలకు అనుగుణంగానే ముందుకెళ్తాం



ఇంటర్ విద్యలో ప్రవేశపెట్టిన నూతన విధానాలు అమలయ్యేలా పటిష్ట చర్యలు తీసుకుని ముందుకెళ్తాం. ఇంటర్ మూల్యాంకనం జరుగుతున్నా, ఖాళీగా ఉన్న అధ్యాపకులచేత తరగతులు నిర్వహించి ఈనెల 23 వతేదీ నాటికి 18నుంచి 20శాతం సిలబస్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వద్దకు అధ్యాపకులను పంపి ప్రభుత్వ కళాశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యా విధానం గురించి వివరించాం. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. 10వ తరగతి విద్యార్థుల పాస్, ఫెయిల్ అనే దానితో సంబంధం లేకుండా ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పొందవచ్చు. ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ రాసుకునే వీలుంటుంది.

- సునీత, డీఐఈవో, నంద్యాల జిల్లా

నేడు ఎమ్మెల్సీ బీటీ నాయుడు ప్రమాణ స్వీకారం

- అమరావతికి చేరుకున్న టీడీపీ శ్రేణులు
- 8న కర్నూలులో భారీ సన్మానం



కర్నూలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల కోటా నుంచి ఎమ్మెల్సీగా రెండో దఫా ఎన్నికైన బీటీ నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు చేత ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. రాష్ట్రంలో గత నెల 29న ఖాళీ అయిన ఐదు ఎమ్మెల్సీలను కేంద్ర ఎన్నికల సంఘం భర్తీ చేసింది. టీడీపీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన బీటీ నాయుడు ప్రమాణ స్వీకారానికి సన్నాహాలు చేస్తున్నారు. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు బీటీ నాయుడుపై నమ్మకంతో రెండోసారి అవకాశం ఇచ్చారు. ఈ క్రమంలో ఆయన ప్రమాణస్వీకారానికి శాసన మండలిలో ఏర్పాట్లు చేశారు. కోసిగి మండలం జుమాలదిన్నె గ్రామానికి చెందిన బెందుల బుడ్డన్న, అయ్యమ్మ దంపతుల కుమారుడు బీటీ నాయుడు ఎంఏ, ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరులో 12 ఏళ్లపాటు న్యాయవాద వృత్తిని కొనసాగించారు. రాయలసీమలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వాల్మీకులు/బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ వాల్మీకి సింహగర్జన సభలు నిర్వహించి సక్సెస్ అయ్యారు. 1994లో అప్పటి ఆదోని ఎమ్మెల్యే కే.మీనాక్షినాయుడు సమక్షంలో టీడీపీలో చేరి క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారు. ఆదోని నియోజకవర్గం టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడుగా టీడీపీలో రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. అధినేత చంద్రబాబు కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా మారారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా మూడు పర్యాయాలు పని చేశారు. కడప, అనంతపురం పార్లమెంటు స్థానం ఇన్‌చార్జిగా పని చేశారు. 2009, 2014 ఎన్నికల్లో కర్నూలు పార్లమెంటు స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా రెండు పర్యాయాలు పోటీ చేసి ఓడిపోయారు. 2019లో టీడీపీ ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికై ఆరు సంవత్సరాలు ఆ పదవిలో కొనసాగారు. గత నెల 29న ఆయన పదవీకాలం ముగిసింది. అదే కోటాలో రెండో పర్యాయం కూడా అధినేత చంద్రబాబు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు.

అమరావతికి చేరుకున్న టీడీపీ శ్రేణులు:

బీటీ నాయుడు నేడు ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేయనుండటంతో ఆదోని, ఆలూరు, మంత్రాలయం ఎమ్మిగనూరు నియోజకవర్గాల నుంచి బీటీ నాయుడు అభిమానులు, పలువురు టీడీపీ శ్రేణులు మంగళవారం అమరావతికి బయలుదేరారు. దాదాపు 50కి పైగా వాహనాల్లో అమరావతికి చేరుకున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి యువనేత, మంత్రి లోకేశ్, ఉమ్మడి జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా హాజరవుతారు. ఇదిలా ఉండగా 8వ తేదీన కర్నూలు జిల్లా టీడీపీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి కథనంతో పరీక్షలు రాశా..

- ఇక చదువు ముగిసిపోయిందని నిరాశకు గురయ్యాను
- వలస నుంచి వచ్చి పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థి
- భావోద్వేగానికి గురైన విద్యార్థిని సన్నక్కి



విద్యార్థిని చిన్నారి సంతోషం

కోసిగి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాయాల్సిన విద్యార్థిని తల్లిదండ్రులతో కలిసి మిర్చి పొలాల్లో కూలీ చేయడానికి వలస వెళ్లింది. కోసిగి మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన సన్నక్కి చిన్న మారెప్ప, కమలమ్మ దంపతుల కుమార్తె. పదో తరగతి చదువుతున్న సన్నక్కి గుంటూరు జిల్లా పేరచెర్ల పొలాల్లో మిర్చి కోసే కూలీ పని చేస్తోందని ఆంధ్రజ్యోతి ప్రతినిధి విద్యార్థిని కూలి పని చేస్తున్న ఫొటోను, బడిలో చదువుతున్నప్పటి యూనిఫాంలో ఉన్న ఫొటోను సేకరించారు. పరీక్ష హాలులో కాదు.. వలస వెళ్లి పొలంలో.. అనే శీర్షికతో మార్చి 19న ఆంధ్రజ్యోతి ప్రధాన పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. గుంటూరు, కర్నూలు జిల్లాల కలెక్టర్లు విద్యార్థిని పరీక్ష రాసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో మూడో పరీక్ష నుంచి కోసిగిలోని మౌంట్ కార్మెల్ పరీక్ష కేంద్రంలో సన్నక్కి తన స్నేహితులతో కలిసి నాలుగు పరీక్షలు రాసింది. మంగళవారం చివరి పరీక్ష రాశాక సన్నక్కి తన ఆనందాన్ని పంచుకుంది. స్నేహితులతో కలిసి ఇట్లా పరీక్ష రాస్తానని అనుకోలేదని, ఇక తన జీవితంలో చదువు ముగిసిపోయిందన అనుకున్నా అని అన్నది. ఆంధ్రజ్యోతి సహకారంతో పరీక్షలు రాశానని ఆనందం వ్యక్తం చేసింది.

కళాకారులకు పెరిగిన ఆదరణ



డీఐజీ కోయ ప్రవీణ్‌ను సత్కరిస్తున్న పత్తి ఓబులయ్య, పాండు రంగయ్య తదితరులు

డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలో కళలు, కళాకారులకు ఆదరణ పెరుగుతోందని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ అన్నారు. ఇటీవల ప్రతిష్ఠాత్మక కళారత్న(హంస) పురస్కారం అందుకున్న టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్యతో పాటు కళాక్షేత్రం సభ్యులు, కళాకారులు డీఐజీని ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కళారత్న, హంస పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్యను అభినందించారు. అనంతరం కళాక్షేత్రంలో జరుగుతున్న కార్యక్రమాలు, కళాకారులకు ఇస్తున్న అవకాశాలపై డీఐజీ అడిగి తెలుసుకున్నారు. సమాజంలో కళాకారులకు ప్రస్తుతం కళలపై ఆదరణ పెరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ అవకాశాలను అందిపుచ్చుకుని ఉత్తమ కళాకారులుగా ఎదగాలన్నారు. అనంతరం డీఐజీని కళాక్షేత్రం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎంలు ప్యాలకుర్తి ఎర్రమ పాండురంగయ్య, నాగేశ్వరరావు, పి. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే ప్రభుత్వంలో కళాకారులకు గుర్తింపు



ఎమ్మెల్యే దంపతులతో పురస్కారగ్రహీత ప్రసాద్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం కళాకారులకు తగిన గుర్తింపు అందించి ప్రోత్సహిస్తోందని కళాకారుడు ఎస్ఆర్ఎస్ ప్రసాద్ అన్నారు. కళాకారుడు ఎస్ఆర్ఎస్ ప్రసాద్ ఉగాది ఉత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కళారత్న (హంస) అవార్డు అందుకున్నారు. దీంతో ఆయన ఆళ్లగడ్డలోని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ దంపతులను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో బాల అకాడమీ కరస్పాండెంట్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఎండలు ప్రజలు విలవిల..!

- అధికమవుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- కర్నూలు నగరంలో కానరాని చలివేంద్రాలు
- చలువ పందిళ్ల ఏర్పాటులోనూ నిర్లక్ష్యమే

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గతేడాది కంటే ఈసారి ఎండలు అధికమయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలను చూస్తుంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. భానుడి ఉగ్రరూపంతో ఎండ వేడిమికి జనం అల్లాడుతున్నారు. ఉదయమే మధ్యాహ్న వాతావరణాన్ని తలపిస్తోంది. తాజాగా మంగళవారం కర్నూలు నగరంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలా ఉంటే తాగునీటి కేంద్రాలు లేక, నీడ కోసం చలువ పందిళ్ల లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగరానికి పనుల నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున వస్తుంటారు. వేసవి నేపథ్యంలో వీరి సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. నిజానికి గతేడాదిలో మార్చి, ఏప్రిల్ నాటికి చలువ పందిళ్లు, ట్రాఫిక్ కూడళ్లలో గ్రీన్ డేరాలు ఏర్పాటు చేశారు. కానీ ఈసారి మాత్రం నగర పాలక సంస్థ అధ్వర్యంలో ఎక్కడా వీటి జాడ కనపడలేదు. చివరికి ప్రజలు అక్కడక్కడా స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో నీటిని తాగుతూ దప్పిక తీర్చుకుంటున్నారు.



బళ్లారి చౌరస్తాలో లేని నీడ వసతి



రాజవిహార్ ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద



రాజవిహార్ సర్కిల్‌లో కానరాని గ్రీన్ టెంట్



కర్నూలు నగరానికి చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు ఎమ్మిగనూరు, ఆదోని, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి సైతం జనం వస్తుంటారు. ముఖ్యంగా సి.క్యాంపు, నంద్యాల చెక్‌పోస్టు, ఆర్ఎస్‌రోడ్డు, వీకర్ సెక్షన్ కాలనీ, వై.జంక్షన్, రాజవిహార్, బళ్లారి చౌరస్తా, ప్రభుత్వ సర్వజన వైద్యశాల తదితర ప్రాంతాలు నిత్యం జనసంచారంతో కిటకిటలాడుతూ ఉంటాయి. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడంతో దాహంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఆయా కూడళ్ల వద్ద చలివేంద్రాలు లేవు. నగరంలో రూ.వందల కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు అధికారులు, పాలకులు గొప్పలు చెబుతున్నారు. కానీ ప్రజలకు మాత్రం గుక్కెడు నీరు, ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు చలువపందిళ్లు ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టరేట్ ఎదుట ఎండలో ప్రజలు

కరువు కనిపించడం లేదా?

- కర్నూలు అర్బన్‌ను కరువు మండలంగా ఎలా ప్రకటిస్తారు?
- వలసలున్నా ఆ మండలాల్లో కరువు కనిపించడం లేదా..?
- ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శుల ధ్వజం

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రబీలో నష్టపోయిన మండలాలు జిల్లాలో 9 మాత్రమే ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించడం దారుణమని, అందులో కర్నూలు అర్బన్ మండలాన్ని కరువు మండలంగా ఎలా ప్రకటిస్తారని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. మంగళవారం రైతు సంఘం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో 51 మండలాల్లో కరువు ఉన్నట్లు ప్రకటించి అందులో పంటలు పూర్తిగా ఎండిపోయి ప్రజలు వలసబాట పట్టిన కర్నూలు జిల్లాలోని హొళగుంద, హాలహర్వి, ఆలూరు, పెద్దకడుబూరు, గూడూరు, బెళగల్, పత్తికొండ, దేవనకొండ, తుగ్గలి మండలాలను కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడం దారుణమని ఆరోపించారు.

కానిస్టేబుల్‌పై ఫిర్యాదు

కర్నూలు క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వెంగన్న అనే కానిస్టేబుల్‌పై కల్లూరు ఇందిరమ్మకట్ట కాలనీకి చెందిన అరవింద్ అనే యువకుడు మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఉగాది ఉత్సవాల సందర్భంగా కానిస్టేబుల్ వెంగన్న విధులు నిర్వహిస్తున్నాడు. అరవింద్ అనే యువకుడు తన ఇంటికి వెళ్లేందుకు కొత్తబస్టాండు వైపు నుంచి కల్లూరు మీదుగా వెళ్లాడు. విధుల్లో ఉన్న కానిస్టేబుల్ వెంగన్న ఆ యువకుడిని అడ్డుకుని ఇటువైపు వెళ్లకూడదని ఆగ్రహం చేశాడు. తన ఇల్లు ఇక్కడేనని ఆ యువకుడు వేడుకున్నా కానిస్టేబుల్ వినలేదు. పైగా ఆగ్రహానికి గురై యువకుడిపై దాడి చేశాడు. తనను తీవ్రంగా కొట్టడంతో ఎడమచేయికి తీవ్రంగా గాయమైందని ఆ యువకుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ సీఐ మధుసూదన్‌గౌడ్ కేసు నమోదు చేసుకున్నారు. ఫిర్యాదుపై విచారణ చేపడుతున్నామని సీఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి

- ముగ్గురిపై కేసు నమోదు

గోనెగండ్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనేలటూరు గ్రామంలో శేషం చిన్న రంగన్నపై ఆదే గ్రామానికి చెందిన ఆశోక్‌తో పాటు మరో ఇద్దరు నీటి జగ్గుతో దాడిచేసి గాయపరిచారు. శేషం చిన్నరంగన్న పంచాయతీ అధికారులు అనుమతితో తన ఇంటి దగ్గర తాగునీటి కొళాయిని వేసుకోవాలనుకున్నాడు. అందులో భాగంగా మంగళవారం చిన్న రంగన్న పైప్ లైన్ కోసం గుంతను తవ్వుతుండగా ఆశోక్, మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి తమ ఇంటి ముందు గుంతను తవ్వకూడదని అడ్డుకున్నారు. అయితే గ్రామ పంచాయతీ అధికారులు గుంత తవ్వకోమని అనుమతి ఇచ్చారని ఆయన చెప్పాడు. దీంతో ఆగ్రహానికి లోనైన ఆశోక్, మరో ఇద్దరు శేషం చిన్న రంగన్నతో ఘర్షణకు దిగారు. పక్కనే ఉన్న నీటి జగ్గుతో శేషం చిన్న రంగన్న తలపై బాదారు. రంగన్న తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవల కోసం కర్నూలు ఆసుపత్రికి రంగన్నను తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు.

మట్కా బీటర్ల అరెస్టు.. రిమాండ్

కోసిగి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కోసిగి ఆర్టీసీ బస్టాండు వెనకాల ముగ్గురు పేకాట ఆడుతుండగా కోసిగి ఆర్టీసీ బస్టాండు వెనుకాల కర్ణాటక మద్యం అమ్ముతూ మట్కాబీటు రాస్తున్నారనే సమాచారంతో కోసిగి ఎస్‌ఐ జి. హనుమంతరెడ్డి తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. వారి వద్ద నుంచి 330 అక్రమ కర్నాటక మద్యం ప్యాకెట్లు, రూ.6,250 నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపించారు.

భార్యపై గొడ్డలితో దాడి

ఆలూరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామంలో భార్య కవితపై భర్త విరేష్ మద్యం మత్తులో గొడ్డలితో దాడి చేశాడు. వివరాల మేరకు.. కదరి తాలూకా సింగంపల్లికు చెందిన కవితను, వీరేశ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే కొంతకాలంగా మద్యానికి బానిసైన వీరేష్ ఇంట్లో భార్యతో తరచూ గొడవపడుతుండేవాడు. మంగళవారం సాయంత్రం తాగి వచ్చి, భార్యపై విచక్షణా రహితంగా గొడ్డలితో దాడి చేశాడు. స్థానికులు అడ్డుకొని భర్తకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గాయపడిన భార్యను హుటాహుటిన ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

చిప్పగిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మండలం కసాపురం గ్రామ శివారులోని బావిలో పడి గొర్రెల కాపరి రామాంజినేయులు(30) మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు కసాపురం పోలీసులు తెలిపారు. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నంచర్లకు చెందిన రామాంజినేయులు గొర్రెలను తీసుకొని కసాపురం గ్రామ శివారులోని బావి వద్దకు వచ్చాడన్నారు.బావిలోనీరు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి పడిఉంటాడన్నారు. గమనించిన స్థానికులు రామాంజినేయులను బావిలో నుంచి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని కసాపురం పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈవిషయంలో విచారణ చేస్తున్నట్లు కసాపురం పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య కష్ణ వేణి, ఇద్దరు పిల్లలు మహేష్ (7), పార్థు (5) ఉన్నారు.



రామాంజిని (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

గూడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.నాగలాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లల్లు యాదవ్(34) అనే యువకుడు మృతి చెందాడు. కర్నూలు మండలం నిడ్జూరుకు చెందిన లల్లు యాదవ్ బైక్‌పై గూడూరు వైపు వస్తుండగా సల్కాపురం సమీపంలో ఎదురుగా వస్తున్న అంబులెన్స్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లల్లు యాదవ్ అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆశలత తెలిపారు.

కారు షెడ్డులో అగ్నిప్రమాదం

ఆదోని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిబాబా నగర్‌లో మంగళవారం కారుషెడ్డులో అగ్నిప్రమాదం సంభవించింది. వివరాల మేరకు హజీస్ అనే వ్యక్తి అక్కడ కారు మరమ్మతుల షెడ్‌ను నిర్వహిస్తున్నారు. మంగళవారం మంటలు చెలరేగడంతో అదుపు చేయడానికి ప్రయత్నించినా విఫలమయ్యాడు. అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు హజీస్ తెలిపారు.

రైల్వే ఇనుప సామగ్రి చోరీ

మహానంది, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు- గుంతకల్లు రైల్వే ఆధునీకరణలో భాగంగా జరుగుతున్న నిర్మాణ పనుల్లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప సామగ్రిని దొంగలించుకొని వెళ్లినట్లు సైట్ ఇంజనీర్ సమంత్‌కుమార్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసారు. రైల్వే డబుల్ ట్రాక్ నిర్మాణ పనులు మహానంది మండలం గాజులపల్లి ఆర్‌ఎస్ సమీపంలో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అక్కడ కాంట్రాక్టర్ ఏర్పాటు చేసుకొన్న ఇనుప సామగ్రి చోరీకి గురైందన్నారు. చోరీకి గురైన ఇనుప సామగ్రి విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో

మహా మోసం!

- ఆదోని అవ్వ బ్యాంకులో రూ.3.24 కోట్ల రుణం
- తీసుకున్న రుణాన్ని చెల్లించని నిర్వాహకులు
- తాకట్టు భూమి వేలం వేసేందుకు సిద్ధమైన అధికారులు
- చివరికి ప్రభుత్వ స్థలంగా గుర్తింపు
- బ్యాంకు సీఈవోతో పాటు ముగ్గురిపై కేసు నమోదు



ఆదోనిలోని శ్రీ మహాయోగి లక్ష్మమ్మ అవ్వ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఇదే

ఆదోని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అది ప్రభుత్వ స్థలం.. ఆ స్థలానికి నాలుగు ఫోర్జరీ సంతకాలు, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించేసి ఏకంగా రూ.3.24 కోట్ల రుణం పొందారు ఆదోనికి చెందిన ఘనులు. అడిగిందే తడువుగా ఆదోనిలోని అవ్వ బ్యాంకు అధికారులు సైతం రుణాన్ని ఇచ్చేశారు. ఎన్నాళ్లకూ రుణం కట్టలేకపోవడంతో తాకట్టు పెట్టిన భూమిని వేలం వేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. తీరా భూమి వద్దకు వెళ్తే అది కాస్తా ప్రభుత్వ భూమి కావడంతో బ్యాంకు అధికారులు ఖంగుతిన్నారు. బ్యాంకులో తాకట్టుకోసం ఉంచిన పత్రాలన్నీ ఫేక్ డాక్యుమెంట్లుగా సబ్ రిజిస్ట్రార్ తేల్చేయడంతో బ్యాంకు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఆదోని పట్టణంలో నివాసం ఉంటున్న ఎల్లే మల్లేశప్ప, ఎల్లే చిన్న బసవ, ఎల్లే చైత్రలు వీరు పట్టణంలోని శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో 60 సెంట్ల భూమి ఉన్నట్లు నకిలీ పత్రాలను సృష్టించారు. 2021 సంవత్సరంలో బ్యాంకు సీఈవో మురళి కృష్ణ సహకారంతో రూ.3.24 కోట్లు రుణం తీసుకున్నారు. నిజానికి సర్వే నెంబరు 24లో 4.50 ఎకరాల పొలం ఉంది. అందులో 4.50 ఎకరాలు టీచర్స్ సొసైటీ పేరిట 40 ఏళ్ల క్రితం రూ.90 వేలకు విక్రయించారు. అందులో తమకుటుంబ సభ్యులకు 60 సెంట్లు భూమి ఉన్నట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు.

వెలుగు చూసిందిలా..!

రుణం తీసుకుని మూడేళ్లు కావస్తున్నా తీసుకున్న రుణానికి సకాలంలో రుణ కంతులను చెల్లించలేదు. బ్యాంకు అధికారులు పదే పదే నోటీసులు పంపించినా సమాధానం రాలేదు.. దీంతో బ్యాంకు అధికారులు రుణగ్రస్తులపై ఆరా తీశారు. మరోవైపు బ్యాంకులో తాకట్టు పెట్టిన భూమి పత్రాలను పరిశీలించారు. వాళ్లు ఒకవేళ రుణం చెల్లించకుంటే తనఖా పెట్టిన భూమినైనా వేలం వేసుకోవడానికి అవకాశం ఉంటుందని భావించారు. ఆ మేరకు తనఖా పెట్టిన భూమిని వేలం వేస్తున్నట్లు పత్రిక ప్రకటన కూడా ఇచ్చారు. అయితే అది సొసైటీ భూమి అని.. క్రయవిక్రయాలకు ఆస్కారం లేదని స్థానికుల నుంచి బ్యాంకు అధికారులకు అర్జీలు వెళ్లాయి. దీంతో బ్యాంక్ అధికారులు డాక్యుమెంట్లను సబ్ రిజిస్ట్రార్ అధికారుల సహాయంతో పరిశీలించారు. బ్యాంకుకు సమర్పించిన డాక్యుమెంట్లు నకిలీవి అని, అందులోని సంతకాలన్నీ ఫోర్జరీ చేసినట్లు సబ్ రిజిస్ట్రార్ తేల్చేశారు. దీంతో బ్యాంకు అధికారులు సంబంధిత సీఈవో గట్టు మురళికి నోటీసులు ఇచ్చారు. రూ.3.24 కోట్లు సంబంధించిన డాక్యుమెంట్ నకిలీవని అందుకు బాధ్యత వహించాలంటూ మెమో జారీ చేశారు. 2024 డిసెంబరు 4వ తేదీన సీఈవో గట్టు మురళిని సస్పెండ్ చేసి రూ.3.24 కోట్ల మొత్తానికి బ్యాంక్ అధికారులు వివరణ కోరారు. అందుకు మూడు నెలలు సమయం అడిగినట్లు ఆలోగా నగదును పూర్తిస్థాయిలో చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు బ్యాంక్ అధికారులు అంటున్నారు. మూడు నెలలు గడిచిపోయినా సీఈవో మురళి నుంచి ఎలాంటి స్పందన లేదు. చేసేదిలేక చివరకు అవ్వ బ్యాంకు చైర్మన్ రాచోటి సుబ్బయ్య వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బ్యాంకు సీఈవోనే సూత్రధారి..?

రుణానికి అవసరమైన డాక్యుమెంట్లు, భూమి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి రుణాలు మంజూరు చేయాల్సిన బాధ్యత సంబంధిత సీఈవోపై ఉంటుంది. అయితే 2021లో సర్వేనెంబర్ 24లో 60సెంట్ల భూమికి రూ.3.24 కోట్లు మంజూరు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇంత పెద్దమొత్తం రుణంగా ఇచ్చేటప్పుడు భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు సరిగ్గా ఉన్నాయా? లేదా? అని చూడకుండానే ఆగమేఘాలపై రుణాన్ని మంజూరు చేశారు. ఈ వ్యవహారంపై బ్యాంకు సీఈవో మురళి హస్తం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సీఈవో మురళితో పాటు ఎల్ల మల్లేషప్ప, చిన్న బసప్ప, చైత్ర నలుగురు కలిసి బ్యాంకును తప్పుదోవ పట్టించారని, నకిలీ పత్రాలతో రుణం పొందినట్లు బ్యాంకు చైర్మన్ రాచోటి సుబ్బయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు.

నలుగురిపై కేసు నమోదు చేశాం



మహాయోగి లక్ష్మమ్మ అవ్వ కో-ఆపరేటివ్ బ్యాంకులో 2021లో నకిలీ భూమి డాక్యుమెంట్లను పెట్టి రూ.3.24 కోట్లను రుణంగా తీసుకొని ఆ మొత్తాన్ని చెల్లించలేదని బ్యాంకు చైర్మన్ రాయచోటి సుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. ఇందులో ఎవరి హస్తముంది, దీనివెనుక సూత్రధారులు ఎవరున్నారు. అన్నదానిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి త్వరలో వారిని అరెస్ట్ చేస్తాం. ఫోర్జరీ డాక్యుమెంట్లు, సబ్ రిజిస్ట్రార్ సంతకంతో పాటు అందుకు వాడిన సీళ్లు కూడా నకిలీవే అని గుర్తించాం. త్వరలో కేసును ఛేదిస్తాం.

- శ్రీరామ్, సీఐ, వన్ టౌన్, ఆదోని

ఈకేవైసీ.. పరేషన్

- గడువు ఏప్రిల్ 30వరకు పొడిగింపు
- రేషన్ కార్డుదారులు తప్పక వేలిముద్ర వేయాల్సిందే అంటున్న అధికారులు



ఆలూరులో ఈకేవైసీ చేయించుకుంటున్న కార్డుదారులు

ఆలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల్లో సభ్యుల నమోదు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, లోపాల సవరణలకు ప్రతి సభ్యుడు ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈనెలాఖరు వరకు గడువు విధించగా ఇంకా 50 శాతానికి పైగా కార్డుదారులు ఈకెవైసీ వేయకపోవడంతో దీని గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగించారు. రేషన్ కార్డుదారులు తప్పక ఈకేవైసీ చేయించాల్సి ఉంది. లేకుంటే సంబంధింత సభ్యుడి పేరు కార్డులో ఉండే అవకాశం లేదు. దీనివల్ల రేషన్, ఇతర లబ్ధికి దూరం అవుతారు.

ఎక్కడైనా చేయించుకోవచ్చు...

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఏ డీలరు వద్ద అయినా ఈకేవైసీ చేసుకోవచ్చు. డీలరుకు కార్డు సంఖ్య తెలియజేస్తే వేలిముద్ర వేయించుకుని, నమోదు చేస్తారు. అప్పుడే వ్యక్తి కార్డులో సభ్యుడిగా ఉన్నట్లు గుర్తింపు లభిస్తుంది. మీసేవా కేంద్రాలు, ఆధార్ కేంద్రాల్లో సైతం చేసుకునే వీలుంది. కార్డుల్లో ఉన్న చిన్నారులకు సంబంధించి ఆధార్ కేంద్రాలకు వెళ్లి అప్డేట్ చేస్తే ఈకేవైసీ ప్రక్రియ జరిగిపోతుందని డీలరులు, అధికా రులు తెలిపారు. ప్రస్తుతం డీలర్లు అవగాహన కల్పిస్తు న్నారు. శాశ్వత వలస మరణాలు, కొత్తగా పుట్టిన వారి వివరాలు తెలుసుకుంటున్నారు.

ఇవీ ప్రయోజనాలు

రానున్న రోజుల్లో ప్రభుత్వం కొత్త కార్డుల మంజూరు, కొత్త వ్యక్తులు, చిన్నారుల పేర్ల నమోదుకు శ్రీకారం చుట్టబోతోంది. దీనివల్ల ప్రస్తుతం కార్డుల్లో ఉన్న సభ్యుల పేర్లు తప్పిపోకుండా ఉండేందుకు, రెండు చోట్ల నమోదై ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ ప్రక్రియ చేపడుతున్నారు. ప్రభుత్వ పథకాలను రేషన్ కార్డు ఆధారగానే అందజేస్తారు. వీటన్నిటికి ఈకేవైసీ నమోదు ఉపయోగపడుతుంది. జిల్లాలో మొత్తం 6,76,209 రేషన్ కార్డులు ఉండగా ఇప్పటికి 50 శాతం మాత్రమే పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు.

వేగవంతం చేయిస్తున్నాం



రేషన్ కార్డుల్లో ఉన్న ప్రతి సభ్యుడి ఈకేవైసీ చేసుకునేలా చర్యలు తీసుకుంటు న్నాం. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఈకేవైసీ జరిగేలా డీలర్‌లకు అవగాహన కల్పించి వేలిమ ద్రలు వేయిస్తున్నారు. ప్రక్రియ వేగవంతం చేస్తున్నాం. డీలర్లకు కూడా సమావేశం నిర్వహించి సూచనలు ఇచ్చాం. ఏప్రిల్ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు పెంచింది. ఆలోగా పూర్తి చేస్తాం. **-గోవింద్ సింగ్ తహసీల్దార్, ఆలూరు.**

ప్రభుత్వ కాలేజీల్లో చేరండి..!

- కరపత్రాలను పంపిణీ చేసిన అధ్యాపకులు



విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

మంత్రాలయం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు పూర్తయిన విద్యార్థుల వెంటపడి కళాశాలల్లో చేరాలంటూ ప్రైవేట్ విద్యా సంస్థలు పోటీపడటం సర్వసాధారణం. కానీ అందుకు భిన్నంగా ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు పదో తరగతి విద్యార్థులు అవగాహన కల్పిస్తున్నారు. మంత్రాలయం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు మద్దిలేటి, జీవానందపాల్, అధ్యాపకులు రమేష్, ప్రభాకర్, వెంకటస్వామి తదితరులు మంగళవారం పదోతరగతి పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. విద్యార్థులను కలిసి ప్రభుత్వ కాలేజీలోని వసతులు, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు వంటి ఏర్పాట్లను వివరిస్తూ తమ కళాశాలలో చేరాలంటూ కోరారు.

దొంగలు బాబోయ్..!



- నంద్యాలలో ఒకే రోజు నాలుగు ఇళ్లలో చోరీ
- మరో రెండు ఇళ్లలో విఫలయత్నం



చోరీకి గురైన నంద్యాలలోని ఓ ఇల్లు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఇళ్లను దొంగలు లక్ష్యం గా చేసుకున్నారు. వరుస చోరీల ఘటనలతో ప్రజలు భయభ్రాంతుల కు గురవుతున్నారు. ఇంటికితాళం వేసి బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. వరుస చోరీల ఘటనలే అందుకు నిదర్శనంగా మారుతున్నాయి. ఇటీవలే నంద్యాల పట్టణ శివారులోని క్రాంతినగర్‌లో టైలర్స్ అసోసియేషన్ నాయకుడు సుభాన్ ఇంట్లో భారీ చోరీ ఘటన మరువకముందే మంగళవారం తెల్లవారుజామున పట్టణ శివారులోని క్రాంతినగర్‌లో నేషనల్ హైవేకు పక్కనే ఉన్న నందిగ్రీన్ హోమ్స్ విల్లాలో వరుసగా నాలుగు ఇళ్లల్లో చోరీలకు పాల్పడి రూ.3 లక్షల నగదు, 12 తులాల బంగారు, అర కిలో వెండిని అపహరించుకుపోయారు. బెడ్‌రూమ్‌లో నిద్రిస్తుండగా వారు బయటకు రాకుండా తలుపులకు గొళ్లెం పెట్టి చోరీలకు పాల్పడ్డారు. మరో రెండు ఇళ్లల్లో చోరీకి విఫలయత్నం చేశారు. ఇంట్లో వారు గుర్తించి కేకలు వేయడంతో దొంగలు అక్కడినుంచి పరారయ్యారు. పట్టణ శివారు ప్రాంతంలో కట్టుదిట్టమైన సెక్యూరిటీ లేకపోవడం, సీసీకెమెరాల వ్యవస్థ పనిచేయకపో వడంతో దొంగలు ముందుగానే రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడినట్లు తెలుస్తోంది. వరుస చోరీల ఘటనలతో దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఇదిలా ఉండగా చోరీలు జరిగిన ప్రాంతానికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలను సేకరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



చిందరవందరగా వస్తువులు

ఎమ్మిగనూరులో పట్టపగలు చోరీ

- బంగారు నగలు ఎత్తుకెళ్లిన దొంగలు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినగర్ ప్రాంతంలో మంగళవారం దొంగలు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. సాయినగర్‌లో నివాసం ఉంటున్న అర్జున్ పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ ప్రాంతంలో ఇంజనీరింగ్ హార్డ్‌వేర్ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం భార్య కర్నూలులో తమ బంధువుల ఇంట్లో జరిగిన దేవరకు వెళ్లడంతో అర్జున్ ఇంటికి తాళం వేసి దుకాణానికి వెళ్లాడు. దీన్ని అదునుగా తీసుకున్న దొంగలు ఇంటికి వేసిన తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న మూడున్నర తులాలు బంగారు నగలు ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం వచ్చిన అర్జున్ ఇంటి తాళాలు పగిలి పోయి ఉండటాన్ని గమనించి స్థానికుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా పట్టపగలు దొంగతనానికి పాల్పడిన దొంగలు ఇంట్లో ఏడు తులాలు బంగారు, రూ. రెండు లక్షల నగదును ఎత్తుకెళ్లినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా అయ్యప్ప స్వామి గుడి ప్రాంతంలో న్యూ ఇందిరా నగర్‌లో సైతం నాలుగైదు రోజుల క్రితం దొంగలు చోరీకి విఫలయత్నం చేసినట్లు స్థానికులు చర్చించుకున్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రోటరీ ఇంటర్నేషనల్ జోనల్ అధికారి గాయత్రీ గోశాల గౌరవాధ్యక్షుడు టీఎస్ విజయ్ కుమార్, ఆయన సతీమణి శారదాదేవి సౌజన్యంతో రోటరీ క్లబ్ గ్రేటర్ కర్నూలు ఇన్నర్‌వీల్ క్లబ్ కర్నూలుశాఖ ఆధ్వర్యంలో ఎ.క్యాంపు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటు చేసిన టీఎస్ విజయకుమార్ కరోనాలో ఒక సంవత్సరం మినహా 20 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో 17వ వార్డు కార్పొరేటర్ పద్మలత, కార్పొరేటర్లు పామన్న, అబ్బాస్, గాయత్రీ గోసేవా సమితి కార్యదర్శి ఇల్లూరు లక్ష్మయ్య, కోశాధికారి ఇల్లూరు రాజ్యలక్ష్మమ్మ, 17వ వార్డు టీడీపీ నాయకులు జితేంద్ర, వినోద్, చంద్రమోహన్, రామకృష్ణ పాల్గొన్నారు.

4 నుంచి ఉరుసు ప్రారంభం

సి.బెళగల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్రేవుల గ్రామంలో వెలసిన సయ్యద్‌షా బడెసా ఖాద్రి ఉరుసు ఉత్సవాలు ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభవుతాయని దర్గా పీఠాధిపతులు సయ్యద్ రసూల్, సయ్యద్ బాబు, సయ్యద్ బడెసా తెలిపారు. ఈనెల 4న గంధం, 5న ఉరుసు, 6న జియారత్ ఫాతెహా జరుగు తాయన్నారు. ఈసందర్భంగా పీఠాధిపతి సయ్యద్ రసూల్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు బీజపూర్, గుజరాత్, ముంబాయి, కలకత్త, తెలంగాణా, బెంగళూర్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ -సీడాప్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటీవ్‌పై మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. 18 నుంచి 26 సంవత్సరాలు గల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 9295355950, 9014296452 నెంబర్లను సంప్రదించాలన్నారు.

యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా

కార్యవర్గ సభ్యుడిగా అవినాష్ శెట్టి



అవినాష్ శెట్టికి అభినందనలు తెలుపుతున్న దృశ్యం

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ సభ్యుడిగా ఎం.అవినాష్ శెట్టి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. యోగా స్పోర్ట్స్ అసోసియేసన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి మంగళవారం కర్నూలులోని తన కార్యాలయంలో అవినాశ్‌శెట్టిని సత్కరించారు. లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి జిల్లా, రాష్ట్రం అభివృద్ధి కోసం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నూతన కమిటీ ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చిందని అన్నారు. 2029 మార్చి వరకు కమిటీ కొనసాగుతుందని అన్నారు. అనంతరం అవినాష్ శెట్టి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు భారతదేశ వ్యాప్తంగా యోగా క్రీడాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారన్నారు. తనను ప్రోత్సహించిన ఏషియన్ యోగా సంఘం అధ్యక్షుడు అశోక్ కుమార్ అగర్వాల్, నూతన అధ్యక్షుడు అనిరుద్ గుప్తా, ప్రధాన కార్యదర్శి అభినవ జోషి, ఉపాధ్యక్షుడు మనోహర్ కుమార్, అధ్యక్షుడు సింహరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడు వర్మలకు కృతజ్ఞతలు తెలిపారు.

కల్లూరులో 94.79 శాతం పింఛన్ల పంపిణీ

కల్లూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ 94.79 శాతం పూర్తి చేసినట్లు మంగళవారం ఎంపీడీఓ జి.నాగశేషాచలరెడ్డి తెలిపారు. మండలంలో మొత్తం 5,966 పింఛన్లు ఉండగా సచివాలయ ఉద్యోగుల ద్వారా 5,655 పింఛన్లను అర్హులకు అందజేశామని, మిగిలిన 311 పింఛన్లు కూడా పంపిణీ చేసి వందశాతం లక్ష్యం పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

తవ్వేస్తున్నారు..!

- అటవీ ప్రాంతంలో యథేచ్ఛగా ఎర్రమట్టి తరలింపు
- పట్టించుకోని అధికారులు



లొద్దిపల్లెలో అటవీ ప్రాంతంలో మట్టిని తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

ఓర్వకల్లు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో ఎర్రమట్టిని యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. అయితే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని లొద్దిపల్లె అడవి కొండలు, ప్రభుత్వ భూముల్లో భారీ యంత్రాలతో తవ్వకాలు జరుగుతున్నాయి. వైసీపీ హయాంలో మట్టి మాఫియా కొనసాగించిన వారే.. ఇప్పటికీ కూడా వారి హవా కొనసాగిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. లొద్దిపల్లె గ్రామ సమీపాన 105 సర్వే నెంబరులో 1,208 ఎకరాలు, 129 ఏలో 200 ఎకరాలు ఫారెస్టు అటవీ ప్రాంతం ఉంది. అక్కడ ఎర్రమట్టి, గ్రావెల్ మట్టి నర్సరీలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, గ్రామ రోడ్లకు యథేచ్ఛగా ఎక్సవేటర్లతో తవ్వుతున్నారు. ఎర్రమట్టిని రియల్ ఎస్టేట్ వెంచర్లకు, నర్సరీలకు తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ఎర్రమట్టి నర్సరీలకు ట్రాక్టరుకు రూ.4వేలు, టిప్పర్‌కు రూ.5వేలు ధర పలుకుతుంది. ఇంత జరుగుతున్నా స్థానిక అధికారులు, ఫారెస్టు అధికారులు అటువైపు కూడా కన్నెత్తి చూడడం లేదు. అయితే అధికారులకు నెల నెలా మామూళ్లు ముట్టచెబు తు న్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రివేళలో ఇష్టానుసారంగా ఎర్రమట్టిని కర్నూలు, ఓర్వకల్లు పరిసర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అటవీ భూములకు ఎలాంటి అనుమతులు ఉండవని, అయినా యథేచ్ఛగా మట్టిని తరలించడం ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తు న్నారు. ఇప్పటికైనా ఎర్రమట్టి తవ్వకాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ట్రాక్టరులో తరలిస్తున్న ఎర్రమట్టి

చర్యలు తీసుకుంటాం



మండలంలోని లొద్దిపల్లె గ్రామ సమీపంలో 105, 129ఏ సర్వే నెంబరులో అటవీ ప్రాంతంలో మట్టిని తవ్వుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. అక్రమంగా మట్టిని తరలిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తాం.

- విద్యాసాగర్, తహసీల్దార్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే



లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్ ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు అర్బన్ మండలం మామిదాలపాడు గ్రామంలో మంగళవా రం ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రంలో అర్హులైన ప్రతి వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్ ప్రతి నెల ఒకటో తేదీన సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మహిళలకు రెండో విడతలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీకి మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆ మేరకు ప్రతి ఒక్కరూ గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో పబ్లిక్ గ్రీవెన్స్

అర్జీలు స్వీకరించనున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారు. బుధవారం మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. కల్లూరు అర్బన్‌లోకి 16 వార్డుల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు అన్నివర్గాల ప్రజలు హాజరై తమ సమస్యలపై అర్జీలు ఇవ్వాలని సూచించారు. అర్జీ వెంట ఆధార్‌కార్డు, సెల్ నెంబర్ ఉండేలా చూసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు.

పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టండి

కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు



పైప్‌లైన్ లీకేజీలను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నగరంలో పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడితే జాప్యం చేయకుండా వెంటనే మరమ్మతులు చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు అధికారులను ఆదే శించారు. మంగళవారం ఆయన వీకర్ సెక్షన్ కాలనీ, పెద్దపాడుతో పాటు నగరంలోని పలు ప్రాంతాలలో పైప్‌లైన్ లీకేజీలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్ లీకే జీలు ఏర్పడితే అక్కడి స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. నీటి వృథాను అరికట్టేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట డీఈఈ నరేష్, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వర్క్ ఇన్స్‌పెక్టర్ కేశవ్ ఉన్నారు.

ముగిసిన పది పరీక్షలు



విజయకేతనం చూపుతున్న పదో తరగతి విద్యార్థినులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారం ముగిశాయి. విద్యార్థులు కేరింతలు వేస్తూ బయటకు వచ్చారు. పరీక్షలు బాగా రాశామని సంతోషం వ్యక్తం చేశారు. పరీక్ష ఫలితాల్లో విజయకేతనం ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మండలంలో 5 పరీక్ష కేంద్రాల్లో 859 మంది పరీక్షలు రాశారు. అయితే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

నీటి తొట్లను త్వరగా పూర్తి చేయండి: ఎంపీడీవో



ఓర్వకల్లులో భూమి పూజ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకుని మూగ జీవాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నీటి తొట్లను నిర్మిస్తుందని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు. మంగళవారం ఓర్వకల్లులోని సచివాల యం సమీపంలో నీటి తొట్టి నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా మండలానికి 16 నీటి తొట్లు మంజూరు చేశారని, నీటి తొట్ల నిర్మాణాలను ఈ నెలాఖరులోపు పూర్తి చేయా లని ఆయన అధికారులను ఆదేశించారు. ఒక్కొక్క నీటి తొట్టికి రూ.33వేలు చెల్లిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, పశువైద్యాధికారి మనోజ్ కుమార్, ఏపీవో కుమార సాయినాథ్, టీఏ, ఇన్‌చార్జి ఈసీ మధుశేఖర్, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, అబ్దుల్లా పాల్గొన్నారు.

గూడూరు: మూగజీవాల దాహం తీర్చేందుకు నీటి తొట్ల నిర్మాణం చేపడుతున్నామని ఎంపీటీసీ మద్దిలేటి అన్నారు. మంగళవారం గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో నీటి తొట్టి నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ.30వేలతో మూగ జీవాలకు నీరు అందించేందుకు తొట్టి నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏ మధు, సురేష్, తిప్పన్న, గోపాల్, నాగసుంకన్న, శివన్న, రవి, హరి, ఆటో దుబ్బన్న పాల్గొన్నారు.

సి.బెళగల్: మూగజీవాల దాహం తీర్చేందుకు నీటి తొట్ల నిర్మాణం చేపడుతున్నామని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో నీటి తొట్టి నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు.





పెంచికలపాడులో నీటి తొట్టికి భూమి పూజ చేస్తున్న ఎంపీటీసీ మద్దిలేటి, సి.బెళగల్‌లో..

బాడుగ రిక్షాలో చెత్త తరలింపు



బాడుగ రిక్షాలో చెత్తను తరలిస్తున్న పారిశుధ్య కార్మికుడు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలో చెత్తను సేకరించే క్లాప్ ఆటోలను పూర్తిగా తొలగించారు. దీంతో చెత్తను సేకరించి తరిలించేందుకు నగరంలో తీవ్ర ఇబ్బంది కనపడు తోంది. మంగళవారం పాతబస్తీలో పారిశుధ్య కార్మికుడు ఓ రిక్షాను బాడుగకు తీసుకుని చెత్తను సేకరిస్తున్నారు. చెత్తను తరలించడానికి తక్షణమే ఆటలోను ఏర్పాటు చేసి ఇబ్బందులను తొలగించాలని స్థాని కులు కోరుతున్నారు. గతంతో క్లాప్ ఆటోలు సక్రమంగా ఇంటి వద్దకు వచ్చి చెత్తను సేకరించేవి. నూతన ప్రభుత్వం వచ్చాక చెత్త పన్ను పూర్తిగా తొలగించడంతో క్లాప్ ఆటోలను తీసివేసారు. ఈ క్రమంలో చెత్తను సేకరించడంతో ఆలస్యం కావడంతో ఇళ్ల ముందర చెత్త కుప్పలు నిల్వ ఉంటున్నాయి. మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్ బాషా జోక్యం చేసుకుని చెత్త తరలింపుకు ప్రత్యామ్నాయం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీల్లో సైకిళ్లకు సంకెళ్లు

- కొరవడిన పారిశుధ్య కార్మికులు
- నిరుపయోగంగా మూడు చక్రాల సైకిళ్లు
- పట్టించుకోని అధికారులు



ఓర్వకలులో మూలన పడిన మూడు చక్రాల సైకిళ్లు

ఓర్వకల్లు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతో పంచాయతీ నిధులతో మూడు చక్రాల సైకిళ్లను కొనుగోలు చేశారు. అయితే కార్మికుల కొరతతో పారిశుధ్యం ఏరులై పారుతోంది. పంచాయతీ నిధులతో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కొనుగోలు చేసిన చెత్తను తీసుకెళ్లే సైకిళ్లకు సంకెళ్లు వేసి భద్రపరిచిన వైనం ఓర్వకల్లు మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రూ. లక్షల్లో పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని ఓర్వకల్లు, హుసేనాపురం, నన్నూరు గ్రామ పంచాయతీలకు 4 నుంచి 5 వరకు చెత్త సేకరణ కోసం సైకిళ్లను కొనుగోలు చేశారు. కేతవరం, లొద్దిపల్లె, భైరాపురం, మీదివేముల, పూడిచర్ల, కన్నమడకల, ఉప్పలపాడు, ఎన్.కొంతలపాడు, గుట్టపాడు, తిప్పాయపల్లె, శకునాల, బ్రాహ్మణపల్లె, కాల్వ, సోమయాజులపల్లె, కొమరోలు, పాలకొలను గ్రామ పంచాయతీలకు రెండు మూడు సైకిళ్లు 2019లో కొనుగోలు చేశారు. చెత్త సేకరణ కోసం ప్రతి పంచాయతీకి సైకిళ్లను పంపిణీ చేశారు. అయితే ఎక్కడా కూడా సైకిళ్లు వాడలేదు. అవి నాణ్యతగా లేకపోవడంతోపాటు పంచాయతీలల్లో పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో ఈ సైకిళ్లు మూలన పడ్డాయి. అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతో సైకిళ్లు పంపిణీ చేస్తే వాటికి సంకెళ్లువేసి భద్రపరిచారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిధులు దుర్వినియోగం



ప్రతి పంచాయతీకి చెత్త సేకరణ కోసం సైకిళ్లు కొనుగోలు చేశారు. అయితే వాటిని ఎక్కడా కూడా ఉపయోగించలేదు. దీంతో అవి పనికి రాకుండా పోయాయి.

- రమేష్, సీపీఐ, ఓర్వకల్లు

నిరుపయోగంగా సైకిళ్లు



చెత్తను వేరివేసే సైకిళ్లను పంచాయతీలకు 3 నుంచి 4 దాకా కొన్నారు. అవి నిరుపయోగంగా మారాయి. వాటిని అధికారులు వినియోగంలోకి తేవాలి.

- శ్రీనివాసులు, ఎన్.కొంతలపాడు

ఘనంగా ఒంటెద్దు బండ్ల పోటీలు



విజేతలతో మంత్రి టీజీ భరత్

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవ సాయ మార్కెట్‌లో మంగళవారం టీజీవీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఒంటెద్దు బండ్ల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో వెంకటరమణ కాలనీకి చెందిన హుశేనీ ఎద్దులు మొదటి స్థానంలో, బంగారుపేటకు చెందిన మద్దిలేటి ఎద్దు రెండో స్థానంలో నిలిచాయి. వెంకటరమణ కాలనీలోని రఫీకి చెందిన ఎద్దు మూడో స్థానంలో నిలిచింది. విజేతలకు మంత్రి టీజీ భరత్ ఆయన కార్యాలయంలో బహుమతులు ప్రదానం చేశారు. మొదటి విజేత హుశేనీ ఎద్దుకు టీజీ భరత్ అరకిలో వెండిని, రెండో విజేతకు 15తులాల వెండి, 3వ విజేతకు 10తులాల వెండిని అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ఉగాది పండుగ సందర్భంగా ఇలాంటి పోటీలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో టీజీవీ ట్రేడ్ యూనియన్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు శేషగిరిశెట్టి, నగర అధ్యక్షుడు బాలయ్య, టీడీపీ వార్డు నాయకులు రాజశేఖర్ రెడ్డి, యేసు పాల్గొ న్నారు.

గూడూరు: ఉగాది పండుగను పురస్కరించుకొని పెంచికలపాడు గ్రామంలో ఎద్దుల బండలాగుడు పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. మంగళవారం గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో ఎస్ఆర్ఎస్‌టీ ఫ్రెండ్స్ ఆధ్వర్యం లో ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించగా ఉప్పరి సుంకన్న ఎద్దులు గెలుపొందగా ప్రథమ బహుమతి రూ.10వేలు ఎస్ఆర్ఎస్ టీ ఫ్రెండ్స్ అందజేశారు. అలాగే ద్వితీయ బహుమతిని ఉప్పరి వెంకటేశ్వర్లు ఎద్దులు గెలుపొందగా రూ.5వేలు టీడీపీ మండల అధ్య క్షుడు జె సురేష్ అందజేశారు. కార్యక్రమంలో పత్తి రవి, సురేష్, తిప్పన్న, శివ, గిడ్డయ్య, నాగ సుంకన్న, గోపాల్, కర్ణం యుంగధర్, శివన్న పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



చనుగొండ్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు జె సురేష్

గూడూరు ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు జె సురేష్ అన్నారు. మంగళవారం గూడూరు మండలం చనుగొండ్ల గ్రా మంలో పింఛన్ల పంపిణి కార్యక్రమంలో భాగంగా ఇళ్ల దగ్గరకే వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు మహేశ్వర రెడ్డి, రంగయ్య పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్-25కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు, ఉత్తీర్ణులైన వారికోసం బుధవారం నుంచి శిక్షణను ప్రరంభిస్తున్నామని, ఉచితంగా మెటీరియల్ కూడా ఇస్తామన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం కళాశాలలో శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల 30వ తేదీన పరీక్ష ఉంటుంని, 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 8121555646, 9059291616 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉచిత బస్సు సర్వీసు ప్రారంభం

మద్దికెర, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా కశాపురం నెట్టికంట ఆంజనేయస్వామి ఆలయానికి ఉచిత బస్సు సర్వీసు ప్రారంభించినట్లు ఈవో వాణి మంగళవారం తెలిపారు. దాతల సహకారంతో గుంతకల్లు నుంచి కశాపురం, కశాపురం నుంచి మద్దికెరకు ప్రతిరోజు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

ఆదోని టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తుందని బీజేపీ అధికార ప్రతినిధి ఆదూరి విజయకృష్ణ అన్నారు. మంగళవారం మాట్లాడుతూ లబ్ధిదారులకు పింఛన్లను సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకుని సక్రమంగా పంపిణీ చేసేలా చూడాలని ఎమ్మెల్యే పార్థసారథి సూచించారన్నారు. రమాకాంత్, చంద్ర, శ్రీకాంత్, తాయన్న, లక్ష్మీనారాయణ, పవన్ కుమార్ పాల్గొన్నారు..

పెరిగిన పంచాయతీ ఆదాయం


వేలాలు నిర్వహిస్తున్న అధికారులు

వెల్దుర్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ వేలాల్లో ఆదాయం గతేడాది కంటే పెరిగిందని సర్పంచ్ శైలజ తెలిపారు. మంగళవారం ఈవోఆర్డీ రవికిశోర్ ఆధ్వర్యంలో సెక్రటరీ లక్ష్మీనాథ్ మంగళవారం వేలాలు నిర్వహించగా, వారపు సంత రూ.5,30,500లు, దినసరి కూరగాయల మార్కెట్ రూ.4,65,500లు, సంత మార్కెట్ దుకాణాలు రూ.4,76,400, పెద్ద మాంసపు అంగళ్లు రూ.27వేలు, జంతువధశాల రూ.1,69,000, రామళ్లకోట రోడ్డులోని దుకాణాలు రూ.12,09600, బస్టాండ్ పార్కింగ్ రూ.12.80 లక్షలు మొత్తం రూ.41,56,800లు వచ్చిందన్నారు. గతేడాది పోలిస్తే ఈ ఏడాది రూ.3లక్షలు ఆదాయం పెరిగినట్లు తెలిపారు. జడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ శైలజ, ఉప సర్పంచి శ్వేత, సిబ్బంది పాల్గొన్నారు.

'ఇది రైతు ప్రభుత్వం'


రాంపురంలో భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందని ఆ పార్టీ నాయకులు తిరుపాల్ నాయుడు, వెంకట్రాముడు చౌదరి, వెంకటస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని రాంపురం, తుగ్గలి, జొన్నగిరి, రాంపల్లె, ఎర్రగుడి తదితర గ్రామాల్లో ఎంపీడీవో విశ్వమోహన్, ఏపీవో హేసుందర్ ఆధ్వర్యంలో నీటి తొట్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. భీమలింగప్ప చౌదరి, మల్లయ్య, సర్పంచ్ కమల్ ఉన్నారు.

ఉపాధి అధికారుల బదిలీ

మద్దికెర, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి అధికారులను బదిలీ చేసినట్లు ఏపీవో నర్సిరెడ్డి మంగళవారం తెలిపారు. మద్దికెరలో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు సుధాకర్, నరేంద్రను పత్తికొండకు వెంకటేశ్వరరెడ్డిని కర్నూలుకు, ఈసీ రాఘవేంద్రను ఆలూరుకు, కంప్యూటర్ ఆపరేటర్ వనితను పత్తికొండకు బదిలీ చేశామన్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

మద్దికెర, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తుగ్గలి, క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించాలని, వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ ఈ ఏడాది అన్ని మండలాల రైతులు తీవ్రంగా నష్టపోయారని కేవలం 9 మండలాలనే ప్రకటించడం అన్యాయమన్నారు. ఉపాధ్యక్షుడు క్రిష్ణ యాదవ్ ఉన్నారు.

దేవనకొండను ప్రకటించాలి


జేడీఏకు వినతిపత్రం ఇస్తున్న శాంతికుమార్

దేవనకొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దేవనకొండను కరువు మండలంగా ప్రకటించాలని డీవీఎంసీ సభ్యుడు కె.శాంతికుమార్ కోరారు. మంగళవారం జేడీఏ వరలక్ష్మికి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఆలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం పజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు పార్టీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలును అర్జీల రూపంలో ఇస్తే అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో నిరసన


మాట్లాడుతున్న ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని బుధవారం కర్నూలు కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ అన్నారు. మంగళవారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల సమావేశం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్న ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ధర్నాకు ఉపాధ్యాయులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. నాగరాజు, నర్సయ్య గౌడ్, తిక్కస్వామి పాల్గొన్నారు.

పట్టా ఇచ్చారు.. స్థలం ఇవ్వరా?

- 2016లో 2 సెంట్ల చొప్పున పట్టాలు ఇచ్చిన టీడీపీ ప్రభుత్వం
- 2019లో 1.5సెంట్లు ఇస్తామన్న వైసీపీ
- స్థలం కోసం లబ్ధిదారుల పోరాటం


పేదలకు పట్టాలు ఇచ్చిన స్థలాలు..


ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న లబ్ధిదారులు (ఫైల్)

మద్దికెర, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పేదలకు స్థలాలు అంటూ హడావిడి చేసిన అధికారులు పట్టాలు ఇచ్చి స్థలాలు చూకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. మండలంలోని ఎం. అగ్రహారం గ్రామంలో సర్వే నెం. 117/1ఏలోని నాలుగు ఎకరాల్లో నాటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కలెక్టర్ చేతుల మీదుగా 2016లో పట్టాలు పంపిణీ చేశారు. 39 మందికి ఒక్కొక్కరికి రెండు సెంట్ల చొప్పున పట్టాలు ఇవ్వడంతో లబ్ధిదారులు ఆ పట్టాలు తీసుకుని రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ప్రభుత్వం మారడంతో

2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చింది. ఆ పార్టీ నాయకులు పట్టాలు పొందిన లబ్ధిదారులకు 2సెంట్ల స్థలం ఇవ్వడానికి ఒప్పుకోలేదు. దీంతో లబ్ధిదారులు కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల వద్ద ఆందోళన చేశారు. స్పందించిన అధికారులు 1.5 సెంట్లు మాత్రమే ఇస్తామని చెప్పారు. అనంతరం లబ్ధిదారులు కొందరు బం డలు పాతారు, అయితే అధికారులు స్థలాల్లోకి వెళితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో లబ్ధిదారులు నిరాశ చెందారు. ఎమ్మెల్యే శ్యాంబాబు స్పందించి తమకు న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

స్థలం చూపలేదు



గత టీడీపీ హయాంలో పట్టాలు ఇచ్చారు గానీ, స్థలాలు చూపలేదు. గత వైసీపీ నాయకులు అడ్డుకోవడంతో మాకు అన్యాయం జరిగింది. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతాం.

- హుశేన్‌పీరా, ఎం.అగ్రహారం

జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ఇంటి పట్టాల సమస్య జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. రికార్డులు పరిశీలించి అర్హులకు పట్టాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తాం.

- హుశేన్ సాహెబ్, తహసీల్దార్

రీ సర్వే అభ్యంతరాలపై ఫిర్యాదు చేయండి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

ఆదోని రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో అభ్యంతరాలున్న వారు ఫిర్యాదు చేయాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మంగళవారం తహసీల్దార్ శివ రాముడుతో కలిసి పెసలబండలో చేస్తున్న రీ సర్వేను పరిశీలించారు. రైతులు తమ అభ్యంత రాలను సెక్షన్ 11 నోటీసు ద్వారా మేజిస్ట్రేటిక్ ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామంలో మొత్తం 1,591 ఎకరాల భూమిని రీసర్వే చేయడానికి ఏడు బృందాలు పనిచేస్తున్నాయన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

- కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే విరుపాక్షి


కలెక్టర్‌కు బొకే ఇస్తున్న ఎమ్మెల్యే

ఆలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆలూరులో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విరుపాక్షి కలెక్టర్ రంజిత్ బాషాను కోరారు. మంగళవారం కర్నూలులో ఎమ్మెల్యే కలెక్టర్‌ను కలిశారు. వేసవి రావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య వచ్చిందన్నారు. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని కోరానని ఎమ్మెల్యే తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై కేసు సరికాదు


ఏఎస్సై శ్రీనివాసులుకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

దేవనకొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెర్నేకల్ పంచాయతీ కార్యదర్శి రాముడుపై కేసు నమోదు చేయడం సరికాదని యూనియన్ కార్యదర్శులు గురుస్వామి, శివశంకర్ సింగ్, కోశాధికారి శేషన్న, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. గ్రామసభ ముగిశాక, జరిగిన ప్రమాదంపై కేసు బనాయించడం అన్యాయమన్నారు. కేసు ఎత్తివేయాలని ఏఎస్సై శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మునిస్వామి, రఫి, రామాంజినేయులు, సోమశేకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు బీసీ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల వద్ద పంచాయతీ ఈవో నరసింహులు పంపిణీ చేశారు. శేషయ్య, హోంగార్డు బాషా, జామీయా మసీదు అధ్యక్షులు హుశేన్‌సాహెబ్, శ్రీను పాల్గొన్నారు.

రాతి దూలం పోటీలు

తుగ్గలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడమకుంట్లలో రాతిదూలం పోటీలను సీపీఐ కార్యదర్శి సుల్తాన్, సర్పంచ్ మస్తాన్‌బీ ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందించారు. టీడీపీ నాయకులు ఫక్కీరప్ప, లింగన్న, తిమ్మన్న పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

తుగ్గలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పించన్లు ఇస్తామని టీడీపీ నాయకులు తిరుపాల్ నాయుడు, బర్మా వీరేష్, మసాల శ్రీను, మిద్దె రవి కుమార్ అన్నారు. మంగళవారం జొన్నగిరి, రాంపురం, పెండేకల్, రాంపల్లె తదితర గ్రామాల్లో నూతన పించన్లను పంపిణీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో భర్తను కోల్పోయిన వారికి, వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారన్నారు. టీడీపీ ప్రభుత్వం అర్హులకు నెల లోపే పించన్లు ఇస్తోందన్నారు. రాంపల్లె శ్రీను, మల్లయ్య, భీమలింగప్ప చౌదరి, మద్దిలేటి చౌదరి, బాలమద్దయ్య ఉన్నారు.

కరువు మండలంగా ప్రకటించడంపై హర్షం

మద్దికెర, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మద్దికెరను కరువు మండలంగా ప్రకటించడం పట్ల టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ పెద్దవీరన్న, శివప్రసాద్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.

'ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటా'

ఆదోని టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తనపై జరుగుతున్న కుట్రను ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటానని మున్సిపల్ చైర్ పర్సన్ వాల్మీకి శాంత అన్నారు. మంగళవారం గణేష్ సర్కిల్ ప్రాంతంలో చేపట్టిన దీక్ష శిబిరంలో ఆమె మాట్లాడారు. మాజీ జడ్పీటీసీ వాల్మీకి రాంభీమ్ నాయుడు పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్లు

- డ్వామా పీడీ వెంకటరమణయ్య


భూమిపూజ చేస్తున్న డ్వామా పీడీ

వెల్దుర్తి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మూగజీవాల దాహార్తి తర్చేందుకు ప్రభుత్వం నీటి తొట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని డ్వామా పీడీ వెంకటరమణయ్య అన్నారు. మంగళవారం నార్లాపురం గ్రామంలో టీడీపీ నాయకుడు సుబ్బరాయుడుతో కలిసి నీటి తొట్ల నిర్మాణానికి భూమి పూజచేశారు. పీడీ మాట్లాడుతూ మండలానికి 21 నీటి తొట్లు మంజూరయ్యాయన్నారు. ఉపాధి కూలీల వేతనాలను ప్రభుత్వం విడుదల చేసిందని, బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారన్నారు. అలాగే వెల్దుర్తిలో ఏపీడీ పద్మావతి మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మన్న, ఈసీ పృథ్వీరాజ్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తున్న టీడీపీ ప్రభుత్వం


హాలహర్వి: నిట్రవట్టిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. మంగళవారం మరిస్వామి మఠం వద్ద వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. నరసప్ప, అట్టెకల్ బాబు, ముద్ద రంగ, కొమ్ము రామంజినేయులు పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలోని నిట్రివట్టి గ్రామంలో వీరభద్రద గౌడ్ పింఛన్లు పంపిణీ చేశారు. ఆలూరు అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని చంద్ర బాబు హామీ ఇచ్చారన్నారు. త్వరలో వేదావతికి నిధులు మంజూరు అవుతాయని, దీంతో ఆలూరుసాగునీటితో సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. తిప్పేస్వామి, రఘు ప్రసాద్ రెడ్డి, అట్టెకల్ బాబు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని రక్షించుకునేందుకు పోరాటం

- రైతు సంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య


పత్తికొండలో జీపుజాతను ప్రారంభిస్తున్న రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని రక్షించుకునేందుకు పోరాడాలని రైతు సంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పత్తికొండలో జీపుజాతను ప్రారంభించారు. ఈ నెల 4న కర్నూలులో నిర్వహించనున్న రైతు సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఏటా అతివృష్టి, అనావృష్టితో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధరలు కల్పించడంతో ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయన్నారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. నాయకులు రాజాసాహెబ్, సురేంద్ర కుమార్, కారన్న, సిద్ధలింగప్ప, నాగిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

ఆదోని రూరల్: పట్టణంలోని అంబేద్కర్ నగర్ కూడలిలో కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య మాట్లాడుతూ దేశంలో 60శాతం మది వ్యవసాయం మీదే ఆధారపడ్డారన్నారు. రాజు, అజయ్ బాబు, బసాపురం గోపాల్, నాగేంద్ర పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి

దేవనకొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దేవనకొండలో ఏఐకేఎస్ ఆధ్వర్యంలో జీపుజాతను రైతుసంఘం జిల్లా కార్యదర్శి నాగేంద్ర, సీపీఐ కార్యవర్గస భ్యుడు మద్దిలేటి శెట్టి ప్రారంభించారు. డాక్టర్ స్వామినాథన్ కమీటి సిఫార్సులను అమలు చేసి, వ్యవసాయ రంగాన్ని కాపాడాలన్నారు. తిమ్మయ్య, నర్సారావ్, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య తిమ్మయ్య కోరారు.

మద్దికెర: రుణాలను మాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాబ్ డిమాండ్ చేశారు. మంగళవారం బురుజుల, మద్దికెర, ఎం.అగ్రహారం, పెరవలి, బసినేపల్లి గ్రామాల్లో జీపుజాత నిర్వహించారు

పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న నూర్ అహ్మద్

ఆదోని టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పరిశ్రమల స్థాపనకు ఎమ్మెల్యే పార్థసారధి కృషి చేయాలని మైనార్టీ పరిరక్షణ సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ కోరారు. మంగళవారం మాట్లాడుతూ గతంలో ఆదోని పారిశ్రామికంగా రెండో ముంబాయిగా పేరుపొందన్నారు. ఆదోనిని కరువు కూడా కరువు మండలాల జాబితాలో చేర్చడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. నరేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు




ఆలూరు మోడల్ స్కూల్‌లో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు... దేవనకొండలో విద్యార్థులు

ఆలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు పరీక్ష అనంతరం విద్యార్థులు కేరింతలు కొడుతూ వీడ్కోలు తెలుపుకున్నారు.

హొళగుంద: మండలంలో పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిసినట్లు ఎంఈవోలు జగన్నాథం, సత్యనారాయణ తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఏబీ కేంద్రాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాలలోని పరీక్షా కేంద్రాల్లో 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

దేవనకొండ: దేవనకొండ జడ్పీ పాఠశాల, కస్తూర్బా, తెర్నేకల్ జెడ్పీ పాఠశాల నాలుగు కేంద్రాలలో 811 రెగ్యులర్, 178 ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాసిన్నట్లు ఎంఈవో తిమ్మారెడ్డి తెలిపారు.

చెత్త నుంచి సంపదతో ఆదాయం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పత్తికొండ ఈవోఆర్డీ నరసింహులు



పత్తికొండ టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదతో పంచాయతీలకు పత్తికొండ ఈవోఆర్డీ నరసింహులు తెలిపారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని పంచాయతీలు ఉన్నాయి?

జవాబు: మేజర్ గ్రామ పంచాయతీ, మొత్తం 17 గ్రామ పంచాయతీలు ఉండగా, పంచాయతీతో పాటు మరో 16 గ్రామ పంచాయతీలు మండలంలో ఉన్నాయి.

ప్రశ్న: పట్టణంలో చెత్తను ఎలా సేకరిస్తున్నారు?

జవాబు: పత్తికొండలో సిబ్బంది ఇంటింటికి వెళ్లి ట్రాక్టర్లు, ఆటోల ద్వారా తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరిస్తున్నారు.

ప్రశ్న: గ్రామాల్లో ఎలా?

జవాబు: గ్రామాల్లో మూడు చక్రాల బండ్ల ద్వారా సేకరించి, తడి, పొడి చెత్తను వేరుచేస్తున్నారు.

ప్రశ్న: సేకరించిన అనంతరం చెత్తను ఎక్కడ వేస్తున్నారు?

జవాబు: ఇంటింటికి వెళ్లి సేకరించిన తడి, పొడి చెత్తనుచెత్త సంపద కేంద్రాలకు తరలించి అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మి కంపోస్టు తయారు చేస్తాం. డిక్కి విక్రయించి, పంచాయతీకి ఆదాయం సమకూరుస్తున్నాం.

ప్రశ్న: పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంది.?

జవాబు: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి నెలా మూడో శనివారం గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేస్తున్నాం.

ప్రశ్న: వేసవిలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామ పంచాయతీలను గుర్తించారా?

జవాబు: మండలంలో తాగు నీటి సమస్య ఉన్న గ్రామాలు నలకదొడ్డి, చక్రాళ్ల, అటికెలగుండు, సందోలి గ్రామాలను గుర్తించాము.

ప్రశ్న: తాగునీటి సమస్య నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించి, ముందు జాగ్రత్తలు తీసుకున్నాం. అత్యవసర సమయాల్లో ట్యాకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నాం.

ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

చంద్రబాబుతోనే సంక్షేమం : రాఘవేంద్రరెడ్డి



పింఛన్ పంపిణీ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలు చేయాలంటే ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాలపల్లి గ్రామంలో టీడీపీజిల్లా ఆధికారి ప్రతినిధి, మాజీ సర్పంచ్ చావిడి వెంక టేష్, మాజీ జడ్పీటీసీ ఆర్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా ఫించ న్‌లను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు ఎస్ఎం గోపాల్‌రెడ్డి, చంద్ర, వీరేష్, లక్ష్మన్న, శివరామ్, రమేష్, లక్ష్మీ కాంత్, నరసింహులు, ఉసేని తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం : ఎమ్మెల్యే బీవీ



లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ లను కూటమి ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 32వ వార్డులో ఎమ్మెల్యే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లా డుతూ సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో హామీ లు అమలు చేయడంతో పాటు ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి లోకి రావాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ గంగిరెడ్డి, వార్డు మాజీ కౌన్సిలర్ పార్వతి, నాయకులు నరసింహులు ఆచారి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

కరువు మండలాలుగా గుర్తించాలి

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు రూరల్, గోనెగండ్ల, నందవరం మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలని వైసీపీ రాష్ట్ర రైతు విభాగం ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవా రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కర్నూలు జిల్లాలో మొత్తం తొమ్మిది మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం గుర్తించింద న్నారు. అయితే ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఉన్న ఎమ్మిగనూరు రూరల్, గోనెగండ్ల, నందవరం మూడు మండలాలను ప్రభుత్వం పరిగ ణనలోకి తీసుకుపోడం తీవ్ర అన్యాయమన్నారు. ప్రభుత్వం మూడు మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలన్నారు.

ఎమ్మెల్సీ ప్రమాణ స్వీకారానికి తరలిన కార్యకర్తలు

కోసిగి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కోసిగి మండలం జుమాలదిన్నె గ్రామానికి చెందిన బీటీ నాయుడు రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ హాలులో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకా రం చేయనున్నడంతో మంత్రాలయం నియోజకవర్గంలో నాలుగు మం డలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సొంత గ్రామమైన జుమాలదిన్నె నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యక ర్తలు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు పల్లె పాడు రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, నాడిగేని చిన్నతా యన్న, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అమరావతికి తరలివెళ్లారు.

'సమస్యలపై ప్రశ్నించడమే నేరమా'?

ఎమ్మిగనూరు రూరల్ ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ప్రశ్నించడమే నేరమా? అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడు, మండల కార్యదర్శి రంగన్న అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ పెద్దకడుబూరు మండంలోని తహసీల్దార్‌ను సీపీఐ నాయకులు ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరినందుకు వారిపై అక్రమ కేసులు బనాయించడం ఏమిటని ప్రశ్నించారు. నిరంతరం ప్రజా, రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న వారిపై అక్రమ కేసులు బనాయించడం సమంజసం కాదన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించకుండా నిత్యం ప్రజలను కార్యాలయాలు చుట్టు తిప్పుకుం టున్నారన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల పక్షాన సీపీఐ నిరంతర పోరాటాలు చేస్తుందన్నారు.

మహిళకు గాయాలు

మంత్రాలయం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో కర్ణాటకకు చెందిన మహిళను కారు ఢీకొనడంతో తీవ్రగాయాలై కాలువిరిగింది. ఈ ప్రమాదం సోమవారం రాఘవేంద్ర సర్కిల్‌లో జరిగింది. మంగళవారం మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలి పిన వివరాల మేరకు శ్రీశైలం దర్శనం ముగించుకుని కర్ణాటక బెల్గావ్‌కు వెళ్తున్న మల్లవ్వ అనే మహిళను కారు అతివేగంగా వచ్చి ఢీకొన్నది. రెండు కాళ్లపై కారు ముందు టైరు ఎక్కడంతో తీవ్ర గాయాలై విరిగాయి. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితు రాలి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ ఆకాష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏఐవైఎఫ్ చొరవతో అండర్ డ్రైనేజీ నిర్మాణం



అండర్ డ్రైనేజీ పనులు చేస్తున్న కూలీలు

మంత్రాలయం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పట్టణం లోని రామచంద్రనగర్ 14వ వార్డులో అండర్ డ్రైనేజీ నిర్మాణం ఏఐవై ఎఫ్ చొరవతోనే పనులు ప్రారంభించినట్లు ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు చిన్న, రాజు అన్నారు. నెల రోజుల నుంచి రామచంద్ర నగర్‌లో అండర్ డ్రైనేజీ నిర్మించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వెంకట్రా ముడు, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, గ్రామ కార్యదర్శి బీవీ నాగరాజుకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం అండర్ డ్రైనేజీకి పైపులు వేసి పనులు చేపట్టడం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు వరదరాజు, ఏఐవైఎఫ్ నాయకులు మనోజ్, సాలెం రాజు, కేశవ్, అబ్రహం, దినేష్, రాజేష్‌లు పాల్గొన్నారు.

రోడ్లపైనే వ్యాపారాలు

వాహనదారులకు తప్పని తిప్పలు

గోనెగండ్ల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్ల, హెచ్ కైరవాడి గ్రామాలలోని ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదా రిలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు ఇబ్బందిగా మారుతోంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పెరుగుతున్న వాహనాల రద్దీకి తగ్గట్టుగా అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్ల సమస్య మరింత జఠిలమవుతుంది. బస్టాండ్ ప్రాంగణంలో ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయడం, రోడ్ల పైనే వ్యాపారాలు నిర్వహించడం వల్ల ప్రతి రోజు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది.

28 గ్రామాలకు కేంద్రంగా..

కర్నూలు, మంత్రాలయం, బళ్లారి, ఆదోని హైదరాబాద్, తిరుపతి, ప్రాంతాల వైపు నుంచి వచ్చే వాహనాల రాకపోకల కారణంగా ఈ రోడ్డు ఎప్పుడు రద్దీగా ఉంటుంది. గోనెగండ్ల, హెచ్ కైరవాడి గ్రామాలలో ఈ ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. 28 గ్రామాలకు చెందిన ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే గోనెగండ్ల, లేదా హెచ్ కైరవాడి గ్రామాలకు చెందిన బస్టాండ్లను ఆశ్రయించాల్సి ఉంది. ఈ గ్రామాలలో బస్టాండ్ ఉన్నా లేనట్టే అనే విధంగా ఉంటుంది. ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రోడ్లు పైనే నిలబడాల్సి వస్తుంది.

రోడ్లను ఆక్రమించి అద్దెలకు..

మండల కేంద్రంలో అనేక చోట్ల రోడ్లపైనే వ్యాపారాలు చేస్తున్నారు. ఎమ్మిగనూరు, కర్నూలు, తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారి లో ఉన్న షాపుల యజమానులు తమ షాపులతో పాటు ముందు ఉన్న ఆర్ అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి చిరు వ్యాపారులకు అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. గోనెగండ్లలోని ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాన్ని అద్దెలకు ఇవ్వ డంతో రోడ్డు ఇరుకుగా మరిపోయింది. దీంతో వాహనాల రాక పోకలకు ఇబ్బందిగా మారింది. చాంద్ టాకీస్ క్రాస్‌రోడ్డు, ఆసుపత్రిక్రాస్‌రోడ్డు, గంజహళ్లి క్రాస్ రోడ్డు దగ్గర ఏ వైపు నుంచి ఏ వాహనం ఎప్పుడు దూసుకువచ్చిఢీకొడుతుందో అనే భయం వెంటాడుతుంది. ఈ కూడళ్లలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన సంఘటలను కూడా చాలా ఉన్నాయి. పెద్ద వాహనాలు వస్తే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. వాహ నాలు ఎక్కడివి అక్కడే నిలిచిపోతాయి. ఒక్కో సారి అంబులెన్స్‌లకు కూడా దారి ఇవ్వని పరిస్థితి ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



రోడ్డు పైనే వ్యాపారులు, నిలిచిన వాహనాలు

రోడ్డుపై వ్యాపారులతో ఇబ్బందిగా ఉంది



వ్యాపారాలు చేసుకునేవారు ఆర్‌అండ్‌బీ స్థలాన్ని వదిలి వ్యాపారం చేసుకోవాలి. రోడ్డు స్థలంలో వ్యాపారాలు చేస్తుండటంతో రోడ్డు మీద వెళ్లే వాహ నాల రాక పోకలకు తీవ్ర అంతరాయ ఏర్పడుతుంది. అధికారులు ఈ విషయం పై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలి.

- కరుణకర్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, గోనెగండ్ల

అధికారులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి



అధికారులు చొరవ తీసుకొని గోనెగండ్లలో నెలకొన్ని ట్రాఫిక్ సమస్యను వెంటనే పరిష్కరిం చాలి. గ్రామాలకు పట్టణాలకు వెళ్లే ఆటోలు ద్వారా సమస్యలు రాకుండా చూడాలి. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించేవిధంగా చర్యలు తీసుకోవాలి.

- కౌలుట్లయ్యనాయుడు, గోనెగండ్ల

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పెద్దకడుబూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరుకు రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని సీపీఐ నాయకులు భాస్కర్ యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, సహాయ కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలా నికి రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడు తున్నారన్నారు. రైతుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవ డంలే దన్నారు. ఉదయం 11గంటలైనా అధికారులు రాకపోవడంతో రైతులు, ప్రజలు ఎండలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఏఐవైఎఫ్ తాలుకా అధ్యక్షుడు జాఫర్ పటేల్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి షేక్షావలి, వీరేష్, రవి, నాగరాజు, నరసింహులు పాల్గొన్నారు.


రాఘవేంద్ర స్వామి మఠానికి విరాళం

మంత్రాలయం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మ ఠానికి కర్ణాటకలోని తుమ్కూరు జిల్లా చెల్లూరు గ్రామానికి చెందిన నాగేష్ అనేభక్తుడు రూ.2 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి,సురేష్ కోణాపూర్ తెలిపా రు. మంగళవారం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని విరాళం ఇచ్చారు. దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థు లు ఆశీర్వదించారు. కార్యక్రమంలో జేపీ స్వామి, నరసింహ దేశాయ్, గిరిధర్, శ్రీపాద ఆచార్‌లు పాల్గొన్నారు.

అగ్నిపథ్‌కు ఏడుగురి ఎంపిక

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఏడుగురు యువకులు అగ్నిపథ్‌కు ఎంపికయ్యారు. ఇటీవల కడపలో జరిగిన అగ్నిపథ్ ఎంపికల్లో ప్రతిభ కనబరిచారు. ప్రతిభ చూపిన కరే జయశంకర్, బోయ వెంకటేష్, బోయ కళ్యాణ్, షరీఫ్, హనుమన్న, బోయ రాజు, బోయ ఎల్లప్పను గ్రామస్థులు అభినందించారు.

మంచాలమ్మకు సుంగధ ద్రవ్యాలతో అభిషేకం



మంచాలమ్మ దేవతకు పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం నిర్వహించారు. మంగళవారం చైత్రమాస తదియ శుభదినాన్ని పురస్క రించుకొని పీఠాధిపతి ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మంగళహరతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తు లకు తీర్థప్రసాదాలను అందజేశారు.

గాజులదిన్నె ప్రాజెక్టులో పర్యాటకుల సందడి



గాజులదిన్నె ప్రాజెక్టులో ఈత కొడుతూ ఫొటోలు తీసుకుంటున్న పర్యాటకులు

గోనెగండ్ల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు పర్యాటకులతో సందడిగా మారింది. ఎమ్మిగనూరు, కోడు మూరు, దేవనకొండ, గోనెగండ్ల తదితర ప్రాంతాల నుంచి ముస్లింలు స్వంతవాహనాల్లో తరలి వచ్చారు. బంధువులు, స్నేహితులతో కలిసి చెట్ల కింద విడిది ఏర్పాటు చేసుకొని భోజనం చేసి ప్రాజెక్టు నీటిలో కొంతసేపు జలక్రీడలాడారు. సాయంత్రం తమ గ్రామాలకు బయలు దేరారు. దీంతో ఉదయం నుంచి ప్రాజెక్టు ప్రాంతం సందడిగా మారింది.

బైలుప్పలలో ప్రత్యేక పూజలు

గోనెగండ్ల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బైలుప్పలలో ఉగాది ఉత్సవాలలో భాగంగా చెన్నకేశవస్వామి జాతర నిర్వహించారు. మంగళవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి చెన్నకేశస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ప్రభకు కూడా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంగరంగవైభవంగా ప్రభోత్సవం గ్రామ ప్రజలు జరుపుకున్నారు. 100 అడుగుల ప్రభను ప్రత్యేకంగా రంగులు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి ఆంజినేయ స్వామి దేవాలయం నుంచి ఈశ్వరదేవాలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్ట పక్కల ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బైలుప్పలలో ప్రభోత్సవానికి హాజరైన జనం

గో సంరక్షణకు విరాళం

కౌతాళం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రముఖ పుణ్య క్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం వద్ద ఉన్న గోశాల అభి వృద్ధికి మంగళవారం ఓ భక్తుడు రూ.50వేల నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో విజ యరాజు మాట్లాడుతూ గోసంరక్షణ కోసం డోన్ పట్టణానికి చెందిన లక్ష్మీనారాయణ గుప్త, నిర్మల కుటుంబ సభ్యులు రూ.50వేల నగదును అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి సన్ని ధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజే శారు. వీరి వెంట ఆలయ అర్చకులు ప్రకాష్ స్వామి ఉన్నారు.

విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిన వైసీపీ

- నాడు- నేడు నిధులు దుర్వినియోగం
- నాణ్యమైన విద్యను అందించడమే

ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని మున్సి పల్ కార్యాలయంలో డీఈవో శ్యాముల్ పాల్, మూడు మండలాలు, పట్టణం ఎంఈఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయా మండలాల్లో పాఠశాలలు, విద్యార్థులతో పాటు వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పాఠశాలల విలీనం పేరుతో వైసీపీ ప్రభుత్వం వేలాది మంది విద్యార్థులను విద్యకు దూరం చేసిందన్నారు. ఒక్క కర్నూలు జిల్లాలోనే 53800మంది విద్యార్థులు డ్రాపౌట్ అయ్యారన్నారు. యువ గళం పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన వెంటనే జీఓ నెం 117ను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రద్దు చేశారన్నారు. ప్రతిపక్ష వైసీపీ ఇటీవల కాలంలో విషప్ర చారం చేస్తోందని మండిపడ్డారు. పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠ శాల స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారని విలేకరులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా ఎమ్మెల్యే బీవీ స్పందిస్తూ.. గ్రామాల్లోనూ, పట్ట ణంలో ఉన్న పాఠశాలల స్థలాలను ఎవరైన ఆక్రమించినా, కబ్జాలకు పాల్పడిన సహించేది లేదన్నారు. అటువంటివి ఉన్నట్లైతే వెంటనే చర్య లు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. సమావేశంలో ఎమ్మిగనూరు, నందవరం, గోనేగండ్ల ఎంఈఓలు ఆంజనేయులు, మధుసూధనరాజు, రఘునాథ్, రామాంజనేయులు, నీలకంఠ పాల్గొన్నారు.



డీఈఓ, ఎంఈఓలతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

పది పరీక్షలు పూర్తి..

- ఉల్లాసంగా.. ఉత్సాహంగా కేంద్రాల నుంచి బయటకు..
- ఇళ్లకు పయనమైన హాస్టల్ విద్యార్థులు

మంత్రాలయం/ ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు టౌన్/ ఎమ్మిగనూరు రూరల్/పెద్దకడుబూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు మంగళవారం మధ్యాహ్నంతో ముగియడంతో విద్యార్థులు విద్యార్థినులు పరీక్ష కేంద్రం నుంచి ఉల్లాసంగా, ఉత్సాహంగా కేరింతలు వేస్తూ బయటకు వచ్చారు. పరీక్ష కేంద్రం బయటి ప్రాంగణం లో స్నేహితులు ఒకరికొకరు వీడ్కోలు చెబుతూ చల్లని పానియాలు తాగుతూ సంతోషంగా గడిపారు. పరీక్షలు ఏ విధంగా రాశామోనని.. పరీక్షలు పూర్తయిన ఉత్సాహమే విద్యార్థులకు సంతోషాన్నిచ్చింది. ఎం డలో చల్లగా..చిల్లవుదామని ఐస్‌క్రీమ్ తింటూ ఆనందంగా కనిపించారు. అనంతరం విజయకేతనం చూపుతూ ఇళ్లకు వెళ్లారు. కస్తూర్బా పాఠ శాల నుంచి విద్యార్థినులు, హాస్టల్స్ నుంచి విద్యార్థులు తమ లగేజీని తీసుకుని సంతో షంగా తమ సొంతూళ్లకు బయలుదేరి వెళ్లారు.



ఎమ్మిగనూరులో హాస్టల్ నుంచి లగేజీతో స్వగ్రామాలకు వెళ్తున్న విద్యార్థినులు



పది పరీక్షలు ముగియడంతో ఆనందంతో కేరింతలు కొడుతున్న విద్యార్థినులు



మంత్రాలయంలో..



పరీక్షలు రాసిన అనంతరం ఐస్‌క్రీమ్ తింటున్న విద్యార్థినులు

కనీస సౌకర్యాలు కరువు

- రహదారులు, డ్రైనేజీలకు నోచుకోని హబిబుల్లా కాలనీ
- ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాలు విస్తరిస్తున్నా కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. పట్ట ణంలోని హబిబుల్లా కాలనీ అభివృద్ధి చెందుతున్న కాలనీల్లో ఒకటిగా చెప్పవచ్చు. కానీ నేటికీ ప్రధానంగా రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు లేవు. ఒకటి,రెండు చోట్ల తప్ప కాలనీలో సీసీ రోడ్లు లేవు. మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతం కావడంతో వర్షాకాలంలో గంజహళ్లి రోడ్డు నుంచి ఉర్దూ ఘర్ వరకు వర్షం నీరు మోకాళ్ల లోతు నిలుస్తుంది. దీంతో కాలనీవాసులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.



హబిబుల్లా వీధిలో నిలిచిన మురుగు నీరు



హబిబుల్లా వీధిలో రోడ్డు, డ్రైనేజీ లేని దృశ్యం